





అందరి దృష్టి రెడ్‌క్రాస్‌పైనే!

- ఐదుగురు సభ్యుల తొలగింపు
- కలెక్టర్ నిర్ణయంపై ఇద్దరు హైకోర్టుకు..
- నేడు పది మంది సభ్యులతో చైర్మన్ ఎంపిక
- వాకాటి విజయకుమార్‌రెడ్డి వైపే మొగ్గు?


- వివరాలు 6లో..

ఎవరు.. ఏమిటి!?

- ఫ్రీహోల్డ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి
- 14,834 ఎకరాలు అక్రమంగా తొలగించినట్లు నిర్ధారణ
- వాటన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని ఆదేశం
- వేగంగా జరుగుతున్న ప్రక్రియ
- మరికొంతకాలం రిజిస్ట్రేషన్ల బంద్

ఫ్రీహోల్డ్ మాటున వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లా అధికారులు విచారణలో గుర్తించిన అక్రమాలన్నిటినీ ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. విచారణ నివేదికలను తారుమారు చేసే అవకాశం లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఆన్‌లైన్ పూర్తికాగానే నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఈ భూముల రిజిస్ట్రేషన్లను కూడా బంద్ చేసింది. మరో రెండు నెలలపాటు ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు అందాయి.

వివరాలు 6లో..



సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

- వివరాలు 7లో

బుచ్చిలో 19 అనధికార లేఅవుట్లు

- వివరాలు 6లో



నెల్లూరు : పొట్టేపాళెంలోని ఇయాన్ డిజిటల్ జోన్ వద్ద హాల్‌టికెట్ల నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 1200 మందికిపైగా హాజరు

నెల్లూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 30వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయ, మధ్నాహ్నం రెండు బ్యాచ్‌లుగా ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మూడు కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు తొలిరోజు 1200 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్ని కేంద్రాల్లో మెటల్ డిటెక్టర్‌లతో క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం విద్యార్థుల నుంచి బయోమెట్రిక్ నమోదు చేసుకుని పరీక్ష హాలులోకి అనుమతించారు.



కేంద్రం వెలుపల తల్లిదండ్రుల నిరీక్షణ

రైల్వే అండర్‌పాస్ పనుల ప్రారంభం

- నాలుగు నెలల్లో పూర్తికి కసరత్తు
- ఆ తర్వాత రంగనాయకులపేట వద్ద..
- ఈ రెండింటికి రూ.19 కోట్ల మంజూరు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో ప్రధాన రైల్వే గేట్లు ఉన్న రంగనాయకులపేట, శెట్టిగుంటరోడ్డు ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు రానున్నాయి. ఇప్పటికే రైల్వేశాఖ వీటి నిర్మాణాలకు రూ.19 కోట్లు మంజూరు కాగా, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. అయితే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మొదట శెట్టిగుంటరోడ్డు రైలుగేటు ప్రాంతంలో అండర్‌పాస్ పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 6 నెలల క్రితమే ఇక్కడ రైల్వేగేటు మూసివేయగా, ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి. డబుల్ రోడ్డు నిర్మాణంతో నాలుగు నెలల్లో ఈ అండర్‌పాస్ పూర్తిచేస్తామని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఇది పూర్తయ్యాకే రంగనాయకులపేట రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం ప్రారంభమవుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే త్వరగా రెండు అండర్‌పాస్‌ల నిర్మాణాలు పూర్తవుతాయి.



శెట్టిగుంటరోడ్డు రైల్వేగేటు ప్రాంతంలో జరుగుతున్న అండర్‌పాస్ పనులు



సాయుధ బలగాల వార్షిక సమీకరణ ప్రారంభం



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న సాయుధ బలగాల సిబ్బంది



ప్రారంభోపన్యాసం చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సాయుధ బలగాల సిబ్బంది వార్షిక సమీకరణ రీఫ్రెష్ ట్రైనింగ్ బుధవారం ప్రారంభమైంది. దీనిని ఎస్పీ జీ కృష్ణకాంత్ నెల్లూరులోని పోలీసు పరేడ్ మైదానంలో ప్రారంభించారు. శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా సాయుధ దళ పోలీసుల సేవలు పోలీసు శాఖకు ఎంతో కీలకమన్నారు. పోలీసు శాఖలో చోటుచేసుకుం టున్న నూతన మార్పులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిం చుకొని మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. సాయుధ దళ పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, మంచి ఆహార పు అలవాట్లు, వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఒత్తిడిని జయించేందుకు యోగా, వ్యక్తిత్వ వికాసం, సైబర్ నేరాలపై అవగాహన, ఆర్థిక స్థితులను మెరుగుపర్చేందుకు మొబిలైజేషన్ ఉపయోగపడుతుందని చెప్పారు. అత్యాధునిక ఆయుధాల నిర్వహణ, ఫైరింగ్ డ్రిల్, మార్చ్ ఫాస్ట్, మాబ్ కంట్రోల్, వీవీఐపీ ఎస్కార్ట్స్, పీఎస్‌వో, బందోబస్త్ ఇలా అనేక అంశాల గురించి పూర్తి అవగాహన పొందాలంటూ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు సింధుప్రియ, గట్టమనేని శ్రీనివాసరావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ వార్షిక సమీకరణ కార్యక్రమం 12 రోజులు కొనసాగనుంది.

- నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి



వాద్య పరికరాలు వాయిస్తూ...


ఎవరు.. ఏమిటి!?

- ఫ్రీహోల్డ్ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి
- 14,834 ఎకరాలు అక్రమంగా తొలగించినట్లు నిర్ధారణ
- వాటన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని ఆదేశం
- వేగంగా జరుగుతున్న ప్రక్రియ
- మరికొంతకాలం రిజిస్ట్రేషన్ల బంద్

నెల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ పేరుతో వేల ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అందులో అసైన్‌మెంట్ భూములు, చుక్కల భూములు, సర్వీసు ఈనాం భూములు ఉన్నాయి. మొత్తంగా 98,785.51 ఎకరాలను ఫ్రీహోల్డ్ మాటున 22-ఏ జాబితా నుంచి బయటకు తీసి వాటికి పట్టా భూములతో సమానంగా హక్కులు కల్పించారు. అందులో అసైన్‌మెంట్ భూములు 55,447 ఎకరాలు, చుక్కల భూములు 43,270.93 ఎకరాలు, సర్వీస్ ఈనాం భూములు 67.58 ఎకరాలు ఉన్నాయి. అయితే ఫ్రీహోల్డ్ మాటున నాడు వైసీపీ నేతలు భారీ కుంభకోణానికి తెరలేపారని మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. నాడు ప్రతిపక్ష నేతలు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. పేదల భూములను దొడ్డిదారిలో అధికార బలం ఉన్న వారు స్వాహా చేశారు. వీటిపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించింది. జాయింట్ కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకూ అందరూ ఫ్రీహోల్డ్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అక్రమాలను గుర్తించారు. మొత్తంగా 14,552.87 ఎకరాల అసైన్‌మెంట్ భూములు, 281.62 ఎకరాల చుక్కల భూములను నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు తేల్చారు. ఇలా తొలగించిన 14,834 ఎకరాల విలువ రూ.వందల కోట్లలోనే ఉంటుందని అంచనా. ఈ భూముల్లో సుమారు 300 ఎకరాల వరకూ రిజిస్ట్రేషన్లు కూడా జరిగినట్లు నిర్ధారించారు. ఈ నివేదికలను గత నవంబరులో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

సీసీఎల్ఏ కీలక ఆదేశాలు

విచారణ నివేదికలను పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు... ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరగడంతో నివ్వెరపోయారు. ఈ క్రమంలో ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫ్రీహోల్డ్ భూముల విచారణ నివేదికలపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అవకతవకలు జరిగిన భూముల పూర్తి వివరాలను ఆన్‌లైన్ చేయాలని సీసీఎల్ఏ ఆదేశించారు. దీంతో మండల స్థాయిలో ఈ వివరాలన్నింటినీ ప్రస్తుతం ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇది పూర్తయ్యాక ఈ భూములపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేశారు. అయితే ఇప్పుడు విచారణ పూర్తవడం, భారీగా అక్రమాలు తేలడంతో తదుపరి చర్యలు తీసుకునే వరకూ రిజిస్ట్రేషన్లను ఆపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. మరో రెండు నెలలపాటు రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయినట్లు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు.



అక్రమాలకు బాధ్యులెవరు?

ఫ్రీహోల్డ్ మాటున అక్రమాలు జరిగినట్లు ఇప్పుడు తహసీల్దార్లు, ఆర్డీవోలు నిగ్గు తేల్చారు. మరి ఇదే తహసీల్దార్లు గత ప్రభుత్వంలో కూడా జిల్లాలోనే పనిచేశారు. పైగా నాడు ఫ్రీహోల్డ్ అర్హత వెరిఫికేషన్ చేసింది కూడా ఈ తహసీల్దార్లే కావడం గమనార్హం. మరి నాడు ఎందుకు తహసీల్దార్లు అక్రమాలను అడ్డుకోలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. వీఆర్వో దగ్గర నుంచి కలెక్టర్ వరకూ అనేకమంది నాడు సంతకాలు పెట్టి జాబితాను ఆమోదించారు. మరి వీరిలో ఎవరి పాత్ర ఎంత..? అన్నది తేలాల్సి ఉంది. అందులోనూ ఫ్రీహోల్డ్ జాబితాలను కలెక్టరేట్‌లో రీవెరిఫికేషన్ చేశారు. మండలాల నుంచి వచ్చిన జాబితాలను సరిచూసుకోవాల్సిన బాధ్యత కలెక్టరేట్‌లోని సంబంధిత సెక్షన్‌పై ఉంది. మరి వారెందుకు ఈ అవకతవకలు గుర్తించలేకపోయారన్నది కూడా అనుమానంగా మారింది. మొత్తంగా ప్రభుత్వం తదుపరి ఎటువంటి చర్యలకు ఉపక్రమిస్తుందన్నది ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రవి అనే యువకుడు బైకుపై వెళుతూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, వాహనదారులు ఈ సంఘటన ఎలా జరిగింది? తప్పెవరిది అని చర్చించుకుంటున్నారే తప్ప ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న రవిని ఆసుపత్రికి తరలిద్దామనే ఆలోచన చేయలేదు. ఈలోపు ఓ వ్యక్తి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే అక్కడకు చేరుకున్న అంబులెన్స్ క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించడంతో కోలుకుంటున్నాడు. కాగా, సకాలంలో స్పందించి ఆ యువకుడిని కాపాడిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నగదు అందింది.

స్పందిస్తే.. మీరే ప్రాణదాతలు!

- క్షతగాత్రులను బతికిస్తే ప్రోత్సాహం
- ఆత్మసంతృప్తితోపాటు ఆర్థిక చేయూత

ఆత్మకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో రహదారులపై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. సకాలంలో వైద్యం అందకే 50 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. కళ్లెదుటే ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడి వారిని ఆసుపత్రికి తరలించేందుకు ఎవరూ పెద్దగా ముందుకురారు. మరి కొందరికి బాధితులను బతికించాలని ఉన్నా ఏదైనా జరి గితే కేసుల్లో ఇరుక్కుంటామని, అందరికీ సమాధానం చెప్పాల్సి వస్తుందని వెనక్కి తగ్గుతున్నారు. ప్రజల్లో ఇలాంటి భయాలను పోగొట్టడానికే కేంద్ర ప్రభుత్వం 2021, అక్టోబరులో 'గుడ్ సమరిటన్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథ కం అమలుకు జిల్లా స్థాయిలో ఏర్పడిన కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. అయితే ఈ పథకం ప్రచారం లేకపోవడంతో ప్రజలకు అవగాహన కొరవడింది. క్షతగా త్రులను తక్షణం ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడితే ఈ పథకం కింద రూ.5 వేలు ప్రోత్సహకాన్ని అందిస్తోంది. తాజాగా ప్రోత్సాహకాన్ని రూ.25 వేలకు పెంచింది.



ఆ గంటే కీలకం

ప్రమాదాల్లో గాయపడిన వారిని మొదటి గంట లోపు ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు. ఎంతో కీలకమైన ఆ గంటను గోల్డెన్ అవర్ అని పిలుస్తారు. ఇలా ప్రాణా లను కాపాడే వారికి తాజాగా ప్రోత్సాహకాన్ని రూ. 25 వేలకు పెంచుతున్నట్లు కేంద్రమంత్రి గడ్కరి ఇటీవల ప్రకటించారు.

పథకం అమలు ఇలా..

రహదారులపై జరిగిన ప్రమాదాల్లో క్షతగాత్రులను కాపా డిన వారికి రూ.25 వేల గుడ్ సమరిటన్ కింద అందు తుంది. ఇది పొందాలంటే క్షతగాత్రుడిని గంటలోపు ఆసు పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారు ప్రాణదాత అంటూ ప్రమాద వివరా లతో కూడిన లేఖను ఇస్తారు. ఆ తర్వాత పోలీసులే ప్రాణదాత వివరాలను కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు పంపుతారు. పూర్తి వివరాలు సేకరించి కమిటీ చైర్మన్ ప్రాణదాతకు నగదుతోపాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. ఒక వ్యక్తి గరిష్ఠంగా ఏడాదిలో ఐదుసార్లు ఈ అవార్డు పొందవచ్చు. వ్యక్తిగత వివరాలు, డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపో వచ్చు. ఎవరి నుంచి వేధింపులు లేకుండా కమిటీ రక్షణ కల్పిస్తుంది. ఏడాదిలో ఎక్కువ మందిని కాపా డిన పది మందిని ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున అందజేస్తారు.

మీ కోసం MEEKOSAM

ప్రాణదాతలకు ప్రోత్సాహం



రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రు లకు సకాలంలో అత్యవసర వైద్యం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రులను కాపాడ టాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలి. అలా కాపాడేవారిని ప్రాణదాతలుగా గుర్తించి ప్రభుత్వం పోత్సహిస్తోంది. కేసులో సాక్షిగా చేర్చి కోర్టులు, స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని భయం లేదు.

- జీ గంగాధర్, సీఐ, ఆత్మకూరు

రియల్టర్ల సమావేశంలో గుంటూరు టౌన్ ప్లానింగ్ అధికారులు, బుచ్చి చైర్ పర్సన్, కమిషనర్



బ్లాక్‌లిస్టులో 19 లేఅవుట్లు ?

- సబ్ రిజిస్ట్రార్‌కు నుడా నోటీసులు
- లేఅవుట్ల రూల్స్ మారాయన్న టౌన్ ప్లానింగ్
- రియల్టర్లతో గుంటూరు టీపీవోల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి22(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగరపంచాయతీలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన 19 లేఅవుట్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశిస్తూ నుడా వైస్ చైర్మన్ బుచ్చి సబ్ రిజిస్ట్రార్‌కు మూడురోజుల క్రితం నోటీసులు జారీ చేశారు.అయితే లేఅవుట్ల ఏర్పాటులో రూల్స్ మారాయని బుధవారం గుంటూరు టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు, స్థానిక రియల్టర్లు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిలతో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఈనెల 11న జారీ చేసిన కొత్త జీవో నెంబరు మూడు ప్రకారం నగర పంచాయతీలో మూడు ఎకరాల్లోపు ఏర్పాటు చేసే లేఅవుట్లకు నగర పంచాయతీ, అంతకు మించి ఎక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తే గుంటూరు టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి అనుమతులు పొందాలని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో రియల్టర్ల తరఫున టీపీవోలకు తమ సమస్యలను రియల్టర్ గుత్తా శ్రీనివాసులు వివరించారు. నగర పంచాయతీతో సంబంధంలేని నుడా, సబ్‌రిజిస్ట్రార్‌కు ఇచ్చిన నోటీసులను రద్దుచేయాలని, రద్దు చేయకుంటే ఆ లేఅవుట్లకు సంబంధించి ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారులు, ప్లాట్లు అమ్ముకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని విన్నవించారు. ఈ సమావేశంలో పలువురు రియల్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ఆర్థికాభివృద్ధికి రూ. 326 కోట్ల రాయితీ రుణాలు

- ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం) జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మైనార్టీల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.326 కోట్ల రాయితీ రుణాలు ఇచ్చిందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో తెలియచేశారు. 50 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీ రుణాలు 19,790 మందికి, నైపుణ్య శిక్షణ ఉపాధి కల్పన ద్వారా 29,426 మందికి మొత్తం 49,218 మందికి ఈ రునాలు అందనున్నాయని తెలలిపపారు. 1500 మందికి రూ.లక్ష లోపు రుణాలు, 3040 మందికి రూ. లక్ష నుంచి 3 లక్షల వరకు, 1525 మందికి రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు, 225 మందికి రూ.8లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి కింద టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర వాటిల్లో 3,428 మందికి ఎంపవర్మెంట్, కింద ఆటోమొబైల్ సెక్టార్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ తదితర వాటిల్లో వెయ్యిమంది మైనార్టీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియచేశారు.



ఇండియన్ రెడ్‌క్రాస్ కమిటీ జిల్లా కార్యాలయం

అందరి దృష్టి రెడ్‌క్రాస్‌పైనే!

- ఐదుగురు సభ్యుల తొలగింపు
- కలెక్టర్ నిర్ణయంపై ఇద్దరు హైకోర్టుకు..
- నేడు పదిమంది సభ్యులతో చైర్మన్ ఎంపిక
- వాకాటి విజయకుమార్‌రెడ్డి వైపే మొగ్గు?

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మొన్న చైర్మన్ రాజీనామా తాజాగా ఐదుగురు సభ్యులపై వేటు వంటి ఘటనలతో అందరి దృష్టి ఇండియన్ రెడ్‌క్రాస్ పైనే నెలకొంది. గత వైసీపీ హయాంలో పాలకవర్గం సభ్యులతోపాటు చైర్మన్ ఎన్నిక వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల రాజనామా చేశారు. అలాగే, వైసీపీతో సంబంధం ఉన్న ఐదుగురు సభ్యులకు కలెక్టర్ ఆనంద్ ఈ నెల 11వ తేదీన నోటీసులు జారీ చేశారు. వివరణ ఇచ్చేందుకు 17వ తేదీ వరకు గడువు ఇచ్చారు. అయితే వారి నుంచి సరైన సమాధా నం రాకపోవ టంతో ఆ ఐదు గురిని కమిటీ నుంచి తొలగిస్తున్నట్లు మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. కమిటీలో కీలకంగా ఉన్న కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డితోపాటు ఎంవీ సుబ్బారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులపై వేటు పడింది. కాగా, కలెక్టర్ నోటీసులపై ఇప్పటికే ఇద్దరు సభ్యులు హైకోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆదిలోనే వివాదాలు

2023, ఏప్రిల్ 2వ తేదీన రెడ్‌క్రాస్ ఎన్నికలు జరగ్గా, 4వ తేదీన చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారిని ఎన్నుకున్నారు. అయితే, అప్పటికే ఎమ్మెల్సీగా ఎన్నికయిన చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ ఎన్నికలలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం 4వేల సభ్యత్వాలు ఉన్న రెడ్‌క్రాస్ ఓటర్ల స్థానంలో తనవారిని ఎక్కువగా జీవిత కాల సభ్యులుగా చేర్చి 7,704 మందిని చేర్చడంపై అనేక ఆరోపణలు వినిపించాయి. ఒక్క నెల్లూరు నగరంలోనే 4,780 మంది సభ్యులుగా ఉండ టంపై విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో వైసీపీ అధికా రంలో ఉండటంతో కొందరు కోర్టుకు వెళ్లినా ఫలితం లేకపోయింది. గతేడాది ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటంతో రెడ్‌క్రాస్ పాలకవర్గ ఎంపికపై దృష్టి సారించింది. నిబంధలు పక్కాగా అమలు చేయడంతో చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులపై వేటు పడింది.

నేడు కొత్త చైర్మన్ ఎన్నిక

ఇదిలా ఉంటే గురువారం కలెక్టర్ ఆనంద్ చాంబర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ నూతన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి ఎన్నిక జరుగుతుంది. ఇందుకు సంబంధించి కలెక్టర్ నోటీసులు కూడా అందచేశారు. రెడ్‌క్రాస్‌లో మొత్తం 15 మంది సభ్యులు ఉండగా, ఐదుగురిని తొలగించడంతో మిగిలిన 10 మంది సభ్యులు నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. 10 మందిలోనూ ఒకరు అందుబాటులో లేకపోవడంతో 9 మంది సభ్యులు మాత్రమే చైర్మన్ ఎన్నికలో అవకాశం ఉంది. కాగా, కమిటీలోని సభ్యులంతా వాకాటి విజయకుమార్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమిత్ షా రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ నాయకుల ఆందోళన

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బుధవారం నెల్లూరు లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాం గ్రెస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్ మాట్లాడుతూ అమిత్ షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామ న్నారు. బీజేపీ ప్రభు త్వం కాంగ్రెస్ పార్టీ త్యాగాలను ఓర్చుకోలేక బురదజల్లే కార్యక్రమం చేపడుతోందని విమర్శించారు. జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఏటూరు శ్రీనివాసు లురెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఈ నిరసన కార్యక్రమాలు జరుగుతున్నా యని చెప్పారు. కార్యక్ర మంలో నాయకులు సురేష్‌బాబు, తిరుపతయ్య, బాలసుధాకర్, ఫయాజ్, కల్యాణి, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490 336550ను సంప్రదించాలన్నారు.

108 వాహనాల్లో ఈఎంటీ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి) పోస్టుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 29వ తేదీ లోపు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలోని 108 కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మేనేజర్ పి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బి.ఫార్మసీ, బిఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు చేసినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, పూర్తి వివరాలకు 8328461648, 9642027098 నెంబర్లుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

ఇతర కులాలను ఎస్సీల్లో చేర్చారు!

అల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఇతర కులాలవారిని ఎస్సీల్లో చేర్చారని, తొలగించమంటే అధికారులు చోద్యం చూస్తున్నారని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరు, విడవలూరు, బోగోలు మండలాల్లోని దాదాపు 30 వేలమంది శంభన్ కులస్థులను ఎస్సీల్లోకి చేర్చారని తెలిపారు. వారిని తొలగించాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. ఎస్సీల్లో అక్రమంగా చేర్చిన శంభన్ కులస్థులను తొలగించి నిజమైన ఎస్సీలకు న్యాయం చేయాలని కోరారు.

సోమశిలలో 68.933 టీఎంసీల నీరు



అనంతసాగరం జనవరి 22 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 1,884 క్యూసెక్కుల ప్రవాహం వస్తు న్న ట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 68.933 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండ లేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పెంచలోరికి ప్రత్యేక పూజలు

పెంచల కోనలో స్వామివారి జన్మ నక్షత్రం అయిన స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, నృసింహ యాగం, కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని బంగా రు గరుడ వాహనంపై క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీని వాసులు రెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

జీజీహెచ్‌కి ఆధునిక సీటీజీ

తల్లి గర్భంలోని పిండం గుండె పనితీరును తెలుసుకునేందుకు ఉపయోగించే కంట్యూనియస్ కార్డియో టోకో గ్రఫీ(సీటీజీ) పరికరాలు ఐదు బుధవారం నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చేరుకున్నాయి. వీటిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు పంపించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ సీటీజీ ద్వారా గర్భంలోని బిడ్డకు గుండెలో తేడాలుంటే తెలుసుకుని మెరుగైన వైద్య చికిత్సలు అందించే వీలుంటుందని తెలిపారు. గుండెకు సంబంధించి అసాధారణ పరిస్థితులున్నా, తగినంత ఆక్సిజన్ అందక పోయినా ఈ పరికరాలతో తెలుసుకోవచ్చని వివరించారు. వీటిని గైనకాలజీ విభాగానికి గురువారం అందిస్తామని తెలియచేశారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)



ఫేక్ ఫోన్‌పే యాప్ ద్వారా
నగదు పంపానంటూ మోసం

- చలామణిలో రూ.500 దొంగనోట్లు

ఉదయగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంట ర్‌లో ఉన్న మద్యం దుకాణానికి ఓ యువకుడు వెళ్లి నాలుగు మద్యం సీసాలు కొనుగోలు చేసి ఫేక్ ఫోన్‌పే యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి రూ.4 వేలు నగదు పంపానంటూ మోసం చేసిన సంఘటన బుధవారం చోటుచేసు కొంది. వివరాల మేరకు.. పట్టణానికి చెందిన జశ్వంత్ అనే యువకుడు మద్యం దుకాణానికి వెళ్లాడు. అక్కడ నాలుగు నాలుగు మద్యం సీసాలు కొనుగోలు చేశాడు. అనంతరం ఫేక్ ఫోన్‌పే ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి నగదు పంపానని చెప్పాడు. దుకాణంలో ఉన్న వ్యక్తి ఫోన్‌పేను పరిశీలించగా నగదు జమకాలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఆ యువకున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అలాగే గత రెండు రోజుల క్రితం అదే మద్యం దుకాణంలో రూ.500 దొంగనోటును ఇచ్చి ఓ యువకుడు మద్యం కొనుగోలు చేశాడు. మద్యం విక్రయాల ద్వారా వచ్చిన నగదును బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా బ్యాంకు అధికారులు దొంగనోటుగా గుర్తించి వెనక్కి ఇచ్చారు. ఆ నోటును సైతం మద్యం షాపు నిర్వాహకులు పోలీసులకు అందజేశారు.



ఐదువందల రూపాయల దొంగనోటు

న్యూస్ బాక్స్

కోర్టుల్లో పీపీల కొరత

- నియామకాల్లో జాప్యం

నెల్లూరు (లీగల్), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని చాలా న్యాయస్థానాల్లో టెన్యూర్ (ప్రభుత్వం నియమించే) పీపీల కొరత ఎక్కువగా ఉంది. వైసీపీ ప్రభుత్వంలో నియమించిన టెన్యూరు పీపీలను కూటమి ప్రభుత్వం రాగానే తొలగించింది. ఈ క్రమంలో కొత్తగా పీపీలను నియమించేందుకు జిల్లా నుంచి జాబితా ప్రభుత్వానికి వెళ్లింది. ఇది జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పురోగతి లేదు. టెన్యూర్ పీపీల నియామకం ఆలస్యంతో చాలా కోర్టులలో ప్రత్యేకించి క్రిమినల్ కేసులలో ట్రయల్స్ పెండింగ్ పడుతున్నాయి. అలాగే సత్వరంగా కక్షిదారులకు బెయిల్ మంజూరు కావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించి టెన్యూర్ పీపీల కొరతను తీర్చాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.

26 నుంచి బ్యాడ్మింటన్ వెటరన్స్ పోటీలు

నెల్లూరు(విద్య), జనవరి 22 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 26, 27 తేదీల్లో వెటరన్స్ జిల్లాస్థాయి పోటీలు, ఎంపికలు జరుగుతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. 35 నుంచి 75 ఏళ్లలోపు వయసు వారికి పురుషులు, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 25వతేదీ సాయంత్రం 5 గంటలలోపు స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు బ్యాడ్మింటన్ కోచ్ వెంకటేష్‌ను సంప్రదించాలని కోరారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికారిణి వాణి

గిరిజన పిల్లలపై దాడులు అరికట్టాలి

- జిల్లా న్యాయ సేవ అధికారిణి వాణి

తోటపల్లిగూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన పిల్లలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని జిల్లా న్యాయసేవ అధికారిణి వాణి పేర్కొన్నారు. మండలంలోని పేడూరు పంచాయతీ కొలిదిబ్బ గిరిజన కాలనీలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి గిరిజన పిల్లలను వ్యభిచార గృహాలకు, భిక్షాటనకు, డ్రగ్స్ సరఫరాకు తరలిస్తున్నారని, అటువంటి వ్యక్తుల వివరాలను గ్రామస్థులు అధికారులకు తెలపాలని కోరారు. ప్రజలకు ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా, వెనుకబడిన వర్గాల నిరక్షరాస్యులకు, అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయ సహాయం అందజేయాలని, ఇందుకు ప్రభుత్వం 1987 సంవత్సరంలో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీడీవో కె వెంకటేశ్వరరావు, ఎస్ రవీంద్రరెడ్డి, జి నారాయణ, ఐటీడీఏ శాంతకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు

- ఏపీ సాక్స్ అదనపు డైరెక్టర్ డాక్టర్ సరస్వతీ దేవి

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఏపీ సాక్స్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సరస్వతీ దేవి వెల్లడించారు. బుధవారం నెల్లూరులోని ఏఆర్‌టీ (యాంటీ రిట్రో వైరల్ థెరపీ) కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై అధికారులతో సమీక్షించారు. కొందరు హెచ్ఐవీ బాధితులతో మాట్లాడారు. జిల్లాలో 8501 మంది ఎయిడ్స్ రోగులు ఉండగా వారందరికీ వైద్య చికిత్సలు అందించేలా ఏఆర్‌టీ కేంద్రం వైద్యులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక కేంద్రం ఏర్పాటు చేసి రోగులకు మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎయిడ్ బాధితుల్లో 4వేల మందికి మాత్రమే పింఛను వస్తోందని, మిగిలిన అర్హులకు పింఛను అందేలా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపుతామని తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.



వైద్యులతో చర్చిస్తున్న అదనపు డైరెక్టర్ డాక్టర్ సరస్వతీ దేవి

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

- సభ్యులను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యేలు
- అధిష్ఠానానికి చేరుతున్న జాబితాలు

నెల్లూరు (హరనాథపురం) జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలకు అతి త్వర లో త్రిసభ్య కమిటీలను నియమించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని సహకార శాఖ పరిధిలో గల ఎన్‌డీసీసీబీ, ఎన్‌డీసీఎంఎస్‌లతోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున అప్పటివరకు నామినేటెడ్ పాలక వర్గాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకు సంబం ధించి సంకేతాలు రావడంతో కూటమి పార్టీల నేతల్లో పదవుల కోసం పోటీ నెలకొంది. నెల్లూ రు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ), నెల్లూరుజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఎండీసీఎంఎస్) పదవులకు కూటమి పార్టీలకు చెందిన పలువురు ఆశావహులు పోటీపడుతున్నారు. పీఏసీఎస్‌లకు సంబంధించి ప్రభుత్వం ముగ్గురు సభ్యుల ప్యానల్ ఏర్పాటు చేస్తోంది. ప్రతి పీఏఎస్ఎస్ నుంచి స్థానిక ఎమ్మెల్యేలు మూడు పేర్లు సేకరించి ఆ ప్యానల్స్ కోసం సభ్యుల వివరాలను అధిష్ఠానానికి పంపుతున్నారు. గ్రామ స్థాయి నాయకులు పేర్లతో జాబి తాలు రూపొందించి ఇప్పటికే నివేదికను తయా రు చేశారు. ఒక్కో సొసైటీకి ఒక పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఒకరి పేరు, కమిటీ సభ్యులుగా ఇద్దరు పేర్లను ఎంపిక చేశారు. ఈ బాధ్యతను టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్‌చార్జులకు అప్పగిస్తూ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పార్టీతోపాటు కూటమి విజ యానికి కృషి చేసిన నేతలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రభుత్వం గౌరవిస్తూ ఉంది. ఇప్పటికే రెండు విడతల్లో జిల్లాలోని నియో జకవర్గస్థాయి నేతలకు ఈ పదవులు దక్కాయి. ఇప్పుడు మండల, గ్రామ స్థాయి నేతలు, కార్య కర్తల వంతు వచ్చింది.



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం



నెల్లూరుజిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయం

- 78 సహకార సంఘాలు

జిల్లాలో 78 సహకార సంఘాలు ఉండగా, 2013లో చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. 2018లో సంఘాలకు పదవీ కాలం ముగియ డంతో పాత కమిటీలనే కొనసాగించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పాలకవర్గాలను రద్దు చేసి త్రిసభ్య కమిటీ లను ఏర్పాటు చేసింది. ఆ పార్టీకి చెందిన వారే ఈ కమిటీల్లో పదవులు పొందారు. తరువాత ఈ కమిటీల పదవీకాలం పొడిగిం చుకుంటూ వచ్చారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వారు పదవులకు రాజీనామా చేశారు. సంఘాలకు త్రిసభ్య కమిటీలు వేయాలని ఆలోచన చేయడంతో ఆశావహులు ఎమ్మెల్యేల సిఫారసుల కోసం యత్నించారు. కూటమి పార్టీల నాయకుల్లో అసంతృప్తి లేకుండా సమన్వ యంతో అందరికీ న్యాయం చేసేలా పదవులు కేటాయించే ఆలోచనలో ఎమ్మెల్యేలు ఉన్నారు.

పొదుపు మహిళలు జీవన ప్రమాణాలు మెరుగు పరచుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజు కుమారి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవడానికి అంతర్గత రుణాలు, ఉన్నతి, శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకుని అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వీ నాగరాజుకుమారి సూచించారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో జిల్లా సమా ఖ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోతే సంఘాలు రుణాల మంజూరుకు అర్హత కోల్పోతాయన్నారు. మండల సమాఖ్యలో కొత్తగా ఎంపికైన అధ్యక్షులకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సమావేశంలో డీపీఎంలు కామాక్షి, రవి, తిరుపతయ్య, మంజుల, శైలజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో 17 మందికి ఉద్యోగోన్నతి

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న 17 మంది ఆఫీస్ సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగో న్నతి కల్పించారు. వారందరికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ బుధవారం జడ్పీ కార్యాలయంలో పదోన్నతి పత్రాలను అందజేశారు. చైర్‌పర్సన్, సీఈవోకు కార్యాలయ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భీమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహబాషా కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

- కారులో వచ్చి హతమార్చిన గుర్తుతెలియని వ్యక్తులు



హత్యకు గురైన దేవుళ్ల రమేష్

కొడవలూరు/బుచ్చిరెడ్డిపాలెం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిక్కిలింపేట రోడ్డులో బుధవారం వేకువజామున ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు కారులో వచ్చి దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు, బుచ్చిరెడ్డిపాలెం మండలం చల్లాయపాలెం గ్రామానికి చెందిన దేవుళ్ల రమేష్ (51), తన కుమారుడు రాజేష్‌తో కలిసి ఆటోలో ఊరూరా తిరుగుతూ పాత ఇనుప సామాన్లకు ఎర్రగడ్డలు విక్రయించేవాడు. రోజూ మాదిరిగానే బుధవారం తెల్లవారుజామున వ్యాపారానికి బయలుదేరాడు. మార్గం మధ్యలోని మిక్కిలింపేట రోడ్డు వద్ద గుర్తు తెలియని దుండగులు కారులో వచ్చి ఆటోని అడ్డగించారు. అనంతరం రమేష్‌ను కారులోకి లాక్కెళ్లి కత్తులతో పొడిచి చంపారు. అడ్డువచ్చిన కుమారుడిని కూడా బెదిరించారు. రమేష్‌ను హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని ఆటోలో పడేసి వెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్తి తగాదాలే హత్యకు కారణమని విశ్వసనీయ సమాచారం.

- సుపారీ విషయం వెలుగులోకి..

కాగా కారులో రాజేష్‌ను తీసుకెళ్తుండగా హత్యకు సుపారీ ఇచ్చారనే విషయం వెలుగుచూసింది. రాజేష్ కాళ్లు , చేతులు కట్టేసి మిక్కిలింపేట నుంచి నెల్లూరుకి తీసుకెళ్తుండగా, నెల్లూరు సమీపంలోకి వెళ్లే సరికి దుండగుల్లో ఒకరు హత్యకు సుపారీ కుదుర్చుకున్న వ్యక్తితో అనుకున్న ప్రకారం పనైపోయింది... రూ.3లక్షలు ఇవ్వమని అడిగాడు. అవతల వ్యక్తి పంపిస్తానని చెప్పడం కారులో బందీగా ఉన్న మృతుడి కొడుకు రాజేష్ విన్నాడు. ఘటనా స్థలానికి విచారణకు వచ్చిన పోలీసు అధికారులకు రాజేష్ ఈ విషయం చెప్పాడని బంధువులు తెలిపారు.

CRIME NEWS

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నెల్లూరురూరల్,జనవరి 22,(ఆంధ్రజ్యోతి) : ఇసుక ట్రాక్టర్ అతివేగం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. నెల్లూరు రూరల్‌లోని పాత మిట్టపాళెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృత్యువాతపడ్డాడు. సీఐ వేణు అందించిన వివరాల మేరకు... కాకుపల్లికి చెందిన కలిచేటి కోటారెడ్డి (85) తన భార్య లీలావతితో కలిసి నెల్లూరుకు బ్యాంకు పని మీద బుధవారం వచ్చారు. పని ముగించు కుని చింతారెడిపాళెం సమీపాన పాత మిట్ట పాళెం మీదుగా తిరిగి ఇంటికి టీవీఎస్ మోటారు సైకిల్ పై వెళ్తున్నారు. వెనుకవైపు నుంచి ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో ట్రాక్టర్ ముందు చక్రాలు కోటారెడ్డి మీదకు ఎక్కాయి. దీంతో అతను అక్కడిక క్కడే మరణించాడు. అతని భార్య పక్కనే ఉన్న పొలాల్లో పడిపోయింది. ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జీజీ హెచ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఇరువర్గాలు పరస్పరం దాడి

నెల్లూరు(క్రైం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని మన్సూర్‌నగర్‌కు చెందిన లీలా వతి, శేఖర్ 2016లో కులాంతర వివా హం చేసుకున్నారు. వారి వివాహం శేఖర్ కుటుం బానికి ఇష్టం లేదు. దీంతో తరచూ వారి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఇదే అదనుగా అదే ప్రాంతానికి చెందిన శేఖర్ కులస్థులు నట రాజ్, మల్లిక, మరికొందరు లీలావతిని కులం పేరుతో దూషించసాగారు. ఈ నెల 15వ తేదీ మల్లిక, దుర్గ, ధన, వాణి తదితరులు శేఖర్ ఇంట్లోకి అక్రమం గా ప్రవేశించి లీలావతి, శేఖర్‌లపై దా డిచేసి గాయ పరిచారు. బాధితురాలు లీలావతి బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, ముగ్గు విషయంలో తనపై, తన కుమార్తెపై లీలావతి, ఆమె భర్త దాడి చేశారని మల్లిక సైతం ఫిర్యాదు చేసింది. ఈ రెండు ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో సీఆర్‌పీఎఫ్ జవాను మృతి



వెంకట నరసయ్య(ఫైల్)

కలిగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను లింగుంటి వెంకట నరసయ్య (41), న్యూఢిల్లీలో విధులు నిర్వహిస్తూ బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. సంక్రాంతికి స్వగ్రామానికి వచ్చిన నరసయ్య ఈనెల 20న తిరిగి న్యూఢిల్లీ వెళ్లి విధుల్లో చేరారు. బుధవారం విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో సహచరులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరసయ్య అకాల మరణంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలోనూ విషాదఛాయలు నెలకొన్నాయి.

కల్తీ మద్యం రాకెట్

- పల్లెపాళెంలో పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు
- ముగ్గురి అరెస్టు

నెల్లూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కల్తీ మద్యం రాకెట్‌కు నెల్లూరు రూరల్ అడ్డాగా మారింది. తక్కువ రకం మద్యాన్ని ఎక్కువ ధరలున్న సీసాల్లో పోసి విక్రయించే ముఠాను ఎక్సైజ్ శాఖకు చెందిన ఎన్‌ఫోర్సుమెంట్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని పెనుపర్తి పంచాయతీ పల్లెపాళెంలో బుధవారం దాడులు జరిపిన పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూరల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. సీఐ ప్రసన్నలక్ష్మి అందించిన వివరాల మేరకు... పల్లెపాళెంలో నివాసముండే తాండ్ర శ్రీను అలియాస్ డాన్ శీను, తలారి వెంకయ్య, తాండ్ర విష్ణు ముఠాగా ఏర్పడి బయట ప్రాంతాలకు చెందిన అంబర్ హార్స్ కేరళ మార్టు వంటి తక్కువ రకం విస్కీలను దిగుమతి చేసుకుంటున్నారు. రూ. 130, 140 ఎంఆర్పీ ఉండే మద్యం సీసాలను సేకరించి వాటిలో నాసిరకం మద్యాన్ని నింపి సమీప ప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ రాకెట్ పై నిఘా ఉంచి ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. 180 ఎంఎల్ (నిప్స్) 57 మద్యం సీసాలు, కల్తీకి వాడే పనిముట్లు, ఒక సెల్‌ఫోన్, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసు కున్నట్లు సీఐ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఒకరి అరెస్టు : 12 సీసాల మద్యం స్వాధీనం

కావలి రూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): కావలి మండలం నడింపల్లిలో బెల్టు దుకాణంలో మద్యం విక్రయాలపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షేక్ మస్తాన్‌వలిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి ఆ భూమిని కాపాడేందుకు
ఏం చర్యలు తీసుకుంటున్నారు?

- పూర్తి వివరాలతో నివేదిక సమర్పించండి
- అటవీ అధికారి, నెల్లూరు కలెక్టర్‌లకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లపల్లి గ్రామం పరిధిలోని 150 ఎకరాల అటవీ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారిని, ఆ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. రెవెన్యూ, అటవీశాఖ ఉమ్మడిగా జరిపిన సర్వేలో సుమారు 150 ఎకరాల అటవీ భూమిని ఆక్రమణదారులు సాగుచేస్తున్నట్లు అధికారులు గుర్తించారని గుర్తు చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. నెల్లూరు, రాపూరు రేంజ్ పోతుకొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో నేల్లపల్లి గ్రామ పరిధిలోని వివిధ సర్వే నెంబర్లలో 150 ఎకరాల అటవీ భూమిని ఆక్రమణల నుంచి కాపాడేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ ఆ జిల్లాలోని వెలుగోను గ్రామానికి చెందిన ఎ.వెంకటరామయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వైఎల్ శివ కల్పనారెడ్డి వాదనలు వినిపించారు. నేల్లపల్లి గ్రామంలోని 150 ఎకరాల అటవీభూమిని 40మంది ఆక్రమించి సాగుచేసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ, అటవీశాఖలు ఉమ్మడిగా సర్వే చేసి ఆ భూమిని అటవీభూమిగా నిర్ధారించాయన్నారు. ఆక్రమణదారుల నుంచి ఆ భూమిని కాపాడేందుకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని, అధికారులకు వినతులు సమర్పించినా ఎలాంటి ప్రయోజనమూ లేదని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	89
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7746
వెండి కిలో ధర	రూ. 94,100
వెండి ఒక గ్రాము	రూ.97.10

ఆర్థిక ఇబ్బందులతో
ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నెల్లూరులోని ముకుందపురంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... నవాబుపేట ముకుందపురానికి చెందిన విజయ భాస్కర్‌రెడ్డి(54) కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలోని ఓ ప్రైవేటు కంపెనీలో క్రాంట్రాక్టు పనులు చేశారు. పనులు పూర్తయినా కంపెనీ బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. దీంతో మంగళవారం తన ఇంట్లో విషం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. విజయ భాస్కర్ రెడ్డి కుమారుడు సాయితేజ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు బుధవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పదో తరగతి పరీక్షల్లో
వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను అందచేస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాలరెడ్డి తదితరులు

ఆత్మకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదవ తరగతిలో వందశాతం ఉతీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని ఎంపీపీ కేతా వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఆయన 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌కు కీలక మలుపు పదోతరగతి ఉత్తీర్ణతేనని, ఉపాధ్యాయుల మార్గదర్శకాలను పాటిస్తూ ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జి బుజ్జిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ తహసిన్ సుల్తానా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చీడపీడల నివారణ

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో చీడపీడలను సులువుగా నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయాధికారిణి డీ ధనమ్మ తెలిపారు. మండలంలోని కొండముడుసుపాలెం, కంచరగుంట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివిధరకాల పైర్లలో రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ నిర్మూలనకు 100 లీటర్ల నీటికి లీటరు వేపనూనె, ఆరు కోడిగుడ్లు, 100 గ్రాముల కుంకుడుకాయ రసం కలిపి పిచికారి చేస్తే సమర్థవంతంగా నిర్మూలన అవుతుందని ఎర్రనల్లి నివారణకు పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయం పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీ రాము, వ్యవసాయ సహాయకులు ఎల్. రమాదేవి, కే శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●కావలి రూరల్ : రైతులు ఏ పంటలు సాగుచేసినా ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పీ సత్యవాణి పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రభుత్వ అనుమతులు తీసుకున్నామన్నారు. ధాన్యం సేకరణకు పంట నమోదు తప్పనిసరి అని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, నాగరాజు, ఉద్యానవనశాఖ అధికారి సుధామయి. ఏవో లలిత, వీఏఏలు, పాల్గొన్నారు.

●అల్లూరు : వరిపైరు పొట్టదశలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గ్రద్దగుంటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు సూచనలిచ్చారు. పొట్ట దశలో చేపట్టాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం పరిశీలన

సీతారామపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్డీ భార్గవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద సృష్టి కేంద్రంలోని తొట్టెలలో తయారవుతున్న వర్మీకంపోస్టు సేంద్రియ ఎరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్తను సేకరించే సిబ్బంది తడి, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం బసినేనిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి జీవన్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ గోపి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సీతారామపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డిఎల్‌డిఏ ఈవో శ్రీనివాసులు కోరారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో బుధవారం ఉదయగిరి వెటర్నరీ ఏడి శశిధర్, డిఎల్‌డిఏ ఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ గోకుల మిషన్ కింద ఖనిజ లవణ మిశ్రమాన్ని పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ చంద్రయ్య, విఏ మాలశ్రీ , ఏహెచ్‌ఏ విజయ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తలుపూరుపాడులో...

● సంగం : మండలంలోని తలుపూరుపాడులో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, స్థానిక సర్పంచ్ నాజ్మున్ని, టీడీపీ నాయకులు బాబు, ఖాదర్‌బాషా, పాడి రైతులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు 'ప్రకాశం' విద్యార్థులు

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 26న జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇద్దరు ఎన్‌సీసీ విద్యార్థినులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల విద్యార్థినులు సీహెచ్ వెంకటశ్రావణి, పొల్లూరి గాయత్రి పరేడ్‌కు ఎంపికయ్యారని, ఇది తమకెంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని టెక్నికల్ డైరెక్టర్ కే విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్లు షేక్ హిమామ్‌షా, సంతోష్ అభినందించారు.

తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి


కందుకూరు: గిడుగు రామ్మూర్తికి నివాళు లర్పిస్తున్న అన్నమయ్య సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రతినిధులు

కందుకూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు గొప్ప సాహితీవేత్తేకాక, వ్యవహారిక భాషోద్యమ పితామహుడని పలువురు వక్తలు కొనియాడారు. గిడుగు 85వ వర్ధంతిని బుధవారం అన్నమయ్య సాహిత్య సేవా వేదిక కార్యాలయంలో జాషువా సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక వేదిక అధ్యక్షకార్యదర్శులు ఇనకొల్లు మస్తానయ్య, శేషగిరిరావు, ప్రతినిధులు ఎం. కిషోర్, కే బ్రహ్మయ్య, షేక్ రహీం, జీ వెంకటస్వామి, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, కృష్ణారెడ్డి, మదినా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి.. ప్రాణాలు కాపాడుకోండి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి


కావలి: రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఆర్డీవో, ఆర్టీవో తదితరులు

కావలి, జనవరి22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్లపై ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించి, ప్రాణాలు కాపాడుకోవాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం, కారులో ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్, సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి ప్రమాదం జరిగితే... మీరేకాకుండా మీ ఎదుటివారి ప్రాణాలు కూడా తీసిన వారవతారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం. వస్నీవంశీక్రిష్ణ, ఆర్టీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈఐ సుందరరావు, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

దగదర్తి (బిట్రగుంట) : దగదర్తి మండలం తడకలూరుకి చెందిన ఇద్దరు గిరిజనులు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. వారి కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. టీడీపీ పేదలకు అండగా నిలిచేపార్టీ అని, బాధిత కుటుంబాలకు తోడుగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, పార్టీ మండలాధ్యక్షుడు హనుమంతరావు, నేతలు జలదంకి శ్రీహరి, ఇబ్రిన్, పులి శీనయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాధాకృష్ణారెడ్డి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీపీ తాళ్లూరు వెంకట కృష్ణప్రసాద్ నాయుడు కూడా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట తడకలూరు సర్పంచు ఆత్మకూరు గిరిబాబునాయుడు ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం : ఆర్డీవో

ఆత్మకూరు : వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆత్మకూరు ఆర్డీవో బి పావని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీసులు, విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రాంభించారు. సీఐ జి గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి ప్రధాన రహదారి వెంబడి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, పలువురు పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని గ్రామస్థుల ఆందోళన


ఉదయగిరి: ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన చేస్తున్న కృష్ణారెడ్డిపల్లి గ్రామస్థులు

ఉదయగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి గ్రామస్థులు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటు వ్యవసాయ పనుల్లేక, ఇటు ఉపాధి హామీ పనులు కల్పించకపోవడంతో కుటుంబ పోషణ భారమై పలువురు ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారన్నారు. పనులు కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరువైందని, ఇప్పటికైనా స్పందించి ఉపాధి పనులు కల్పించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

'ఉపాధి' పనులు గుర్తించండి

లింగసముద్రం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కే.శ్రీనివాసులు చెప్పారు.బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలు, ఫారం పాండ్సు ఏర్పాటు చేసేందుకే, అమృత్ సరోవర్ పథకం కింద సన్నకారు రైతులు గడ్డి పెంపకానికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ చినకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గాజు గుర్తు గుర్తింపుపై జనసేన హర్షం

లింగసముద్రం, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసును శాశ్వతంగా రిజర్వు చేయడంపై మండల జనసేన అధ్యక్షుడు ఏ నరసింహరావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో జనసేనను చేర్చడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలలో కలపొద్దు

లింగసముద్రం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను లింగసముద్రంలోని సౌత్‌పాఠశాలలో ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో కలపొద్దని టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, కాలనీవాసులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం లింగసముద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో-2 ఎంవీ శివకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ తమ కాలనీలోని పాఠశాలలోని 3,4,5 తరగతులను గతంలో హైస్కూల్‌లో విలీనం చేశారని, ప్రస్తుతం 1,2 తరగతుల విద్యార్థులు 20మంది ఉన్నారని చెప్పారు.లింగసముద్రం సౌత్ పాఠశాలలలో ఏర్పాటు చేసే మోడల్ పాఠశాల కి.మీ దూరంలో ఉందని, అందువల్ల చిన్న పిల్లలు అంత దూరం వెళ్లలేరని తెలిపారు. కావున కాలనీలోని పాఠశాలను మార్చవద్దని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎంఈవో-2 తెలిపారు.

న్యూస్ బాక్స్

అట్రాసిటీ కేసు విచారణ

కలువాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెరుబొట్లపల్లికి చెందిన కోలా వంశీ ఫిర్యాదు మేరకు ఈనెల 19వ తేదీ కలువాయి పోలీసులు నమోదు చేసిన అట్రాసిటీ కేసును బుధవారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ గ్రామానికి వచ్చి విచారించారు. ఈనెల 18వ తేదీ తాను మోటారుసైకిల్‌పై వెరుబొట్లపల్లి రోడ్డు వద్దకు వెళ్తుండగా గేదెలు అడ్డురావడంతో హారన్ కొట్టానని, అక్కడ ఉన్న సంకల పవన్ హారన్ ఎందుకు కొట్టావని గొడవపడి తాను తిరిగి గ్రామానికి చేరుకున్న తరువాత మరో ఐదుగురితో కలిసి తమను కులం పేరుతో దూషించి దాడిచేశారని వంశీ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేయగా డీఎస్పీ విచారణ జరిపారు. ఆయన వెంట ఎస్‌ఐ సుమన్ ఉన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

కొండాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటలో తాగునీటి పైపులైను దెబ్బతిని కొద్దిరోజుల నుంచి నీరు లీకవుతున్నది. ప్రతి ఇంటికి నీరు అందాలనే ఆలోచనతో గ్రామ టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర ఆధ్వర్యంలో బుధవారం పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రెండు కొత్త బోర్లను మంజూరు చేశారని, పనులు పూర్తయితే పంచాయతీ పరిధిలోని రెండు ఎస్సీ కాలనీలకు తాగునీటి సరఫరా సజావుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఎం జెండా ఆవిష్కరణ

అనంతసాగరం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం సీపీఎం జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కళాజాతా బృందం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వేము పెంచలయ్య, గాడి సుధాకర్, సుబ్బారాయుడు, అన్వర్‌బాషా, జక్కరయ్య, మీరామొహిద్దిన్, ఫకూర్‌సా తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి వితరణ

బిట్రగుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పేదలు, అనాథలకు బోగిరి కుటుంబ సభ్యులు బుధవారం భోజనం, పండ్లు అందచేశారు. అనంతరం రాగాల జాషువా డేనియేల్ మాట్లాడుతూ అమ్మమ్మ బోగిరి మణెమ్మ జ్ఞాపకార్థం సామాజిక కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. క్రైస్తవ సమాధుల తోటకు రెండు వైపులా ఇనుప గేట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాగాల పావని ట్రస్ట్ వ్యవస్థాపకుడు బీ.ప్రభాకర్, బీ.రాజు, రాకేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిని కలిసిన అళహరి

కావలిటౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్‌ను బుధవారం జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. శాలువాతో సత్కరించి అభినందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి


మొక్కలు నాటుతున్న బ్యాంకు అధికారులు

ఉదయగిరి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని గండిపాళెం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు శోభన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటించాలని, ప్రధాన రహదారులు, వీధులు, నివాసాల సముదాయాల్లో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం, పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఇంతియాజ్, క్లర్కులు రమేష్, అజయ్, మెసెంజరు చిన్నఖాశిం తదితరులు పాల్గొన్నారు.

● కావలి రూరల్ : విద్య తోనే యువత భవితకు బంగారు బాటలు వేయవచ్చని నెల్లూరు ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయ సీనియర్ మేనేజర్ కే అజయ్ సింహరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోనిజనతాపేట, మెయిన్ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో బుధవారం వెంగళరావునగర్‌లోని గురుకుల పాఠశాలలో స్వచ్ఛతా పక్వాడా-2025 కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు చిన్నతనం నుంచే స్వచ్ఛత, పరిశుభ్రత అలవర్చుకోవాలన్నారు. తమ బ్యాంకు అతి తక్కువ వడ్డీకి ఇచ్చే గృహ, వాహన రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కావలి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ పద్మలోచన్‌సేతి, జనతాపేట శాఖ మేనేజర్ శ్రీకాంత్, సరళ రుణకేంద్రం మేనేజర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కుంకు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సందానీ దంపతులకు సన్మానం

ఉదయగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఉదయగిరి పట్టణం దిలార్‌భాయ్ వీధికి చెందిన షేక్ సందానీ, షాహీన్ దపంతులను, చెక్కనగిషీ కేంద్రం నిర్వాహకుడు షేక్ జాకీర్‌హుస్సేన్‌లను బుధవారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ చెక్కనగిషీ కేంద్రం ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతోపాటు కేంద్రంలో వందలాది మంది మహిళలకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. చెక్కనగిషీ కేంద్రానికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరించి అభివృద్ధి చేస్తే మరింత మంది మహిళలు ఉపాధి పొందడంతోపాటు వారి చేతుల్లో నుంచి అద్భుతమైన కళాఖండాలు ఉద్భవిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అబ్దుల్‌రజాక్, మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను మార్పు చేయాలి

బిట్రగుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఎస్సీపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంక టక్రిష్ణారెడ్డిని కోరినట్లు టీడీపీ మండల యువత అధ్యక్షుడు అన్నంగి ఆదిశేషయ్య తెలిపారు. బుధవారం ఆయన బోగోలులో మాట్లాడుతూ పంచాయతీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 70 మందికిపైగా ఉన్నారని తెలిపారు. పాఠశాలను పదవ తరగతి వరకు పెంచగలికితే బడిబయట పిల్లల సంఖ్య చాలా వరకు తగ్గుతుందన్నారు. ఈ విషయమై గ్రామస్థులతో కలిసి వెళ్లి ఎమ్మెల్యేకి వివరించి వినతిపత్రం అందచేశామని అన్నారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ అన్నంగి నరేష్, టీడీపీనేత పెయ్యల శీనయ్య, దళిత నేత కాకి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా సంస్థలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

కావలిటౌన్, జనవరి22(ఆంధ్రజ్యోతి) బీమా సంస్థల్లో క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుర్తింపును కొనసాగించాలని ఎల్‌ఐసీ ఉద్యోగులు బుధవారం నిరసన చేపట్టారు. పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో ఉన్న ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో ఐసీఈయూ కార్యదర్శి రవికుమార్, యూనియన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊటుకూరులో ఆధార్ స్పెషల్ డ్రైవ్

వింజమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు గ్రామంలోని సచివాలయంలో నందిగుంట, ఊటుకూరు పంచాయతీ ప్రజల కోసం ఆధార్ స్పెషల్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. చిన్న పిల్లలకు కొత్త ఆధార్ తీయడం, 5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ అప్‌డేట్ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో పిల్లలకు వేలిముద్రలు తీయడం, అప్‌డేట్ చేయించడం జరిగిందన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి కలెక్టర్ ఆదేశానుసారం ఆధార్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆధార్‌లోని పేర్లు మార్పు, పుట్టినతేదీ సవరణలు, అడ్రస్ మార్పు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మీ, సుబ్బరత్నమ్మ, చెన్నమ్మ, తిరుపతమ్మ, రాధా, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంటు ఏర్పాటుకు రాయితీ

కావలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా గృహాలపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకునేవారికి ప్రభుత్వ రాయితీ, బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తున్నాయని కావలి విద్యుత్‌శాఖ డీఈఈ రవికుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బృందావనం కాలనీ వాసులకు సోలార్ విద్యుత్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏఈ వసంతరావు, బృందావనం కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం మాల్యాద్రి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు లోకేశ్‌బాబు జన్మదిన వేడుకలు

ఉదయగిరి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 9959225645 నెంబరుకు తెలియజేయాలని కోరారు.

చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి22(ఆంధ్రజ్యోతి): చేపల గుంతల్లోని చేపలకు కుళ్లిన చికెన్, కోళ్ల వ్యర్థాలను ఆహారంగా వేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వారు కోళ్ల వ్యర్థాల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ప్రజారోగ్యం దృష్ట్యా చేపలకు ఆహారంగా వేసే వ్యర్థాలను అరికట్టడంకోసం పంచాయతీల వారీగా గ్రామ స్థాయి అధికారులకు సూచనలిచ్చారు. గుంతల నిర్వాహకులతో మాట్లాడి వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తామన్నారు. ఆయా రైతులకు మత్స్యశాఖ నుంచి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చేపలగుంతల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

'అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా'..?

కొడవలూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తాను రైతులపై పిటిషన్ పెట్టి బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నామని ఓ వైసీపీ నాయకుడు అసత్య ఆరోపణలు చేశారని, తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇకపోతే మీరు చేసిన అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని వైసీపీ నేతలకు ఆయన సవాల్ విసిరారు.

ఎలుకల నివారణపై అవగాహన

మనుబోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో ఎలుకల నివారణపై వ్యవసాయశాఖ ఏడీఏ శివనాయక్ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని పిడూరు గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బియ్యం నూకల్లో బ్రోమోడయోలిన్ మందును కలిపి వరిపొలాల్లో పెడితే ఎలుకలను నివారించుకోవచ్చునని, దీనిద్వారా దిగుబడిలో 10శాతం నష్టం రాకుండా నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జహీర్, ఏఈవో కళారాణి, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మనుబోలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వచ్చేనెల 1నుంచి 3వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్రమహాసభలు జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎంవి రమణ కోరారు. స్థానిక ఆటోసెంటర్ కూడలిలో బుధవారం కళాజాతా మహాసభలపై నృత్య గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం, సీపీఎం నాయకులు రమేష్ పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి



పొదలకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పచ్చా పెంచలయ్య తన సూక్ష్మ చిత్రకళ ద్వారా రావి ఆకుపై సుభాష్ చంద్రబోస్ చిత్రాన్ని గీసి నివాళి అర్పించారు.

మేము సైతం...!

● ట్రాఫిక్ నియంత్రణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



సమాజ సేవ చేయాలనుకుంటే దానికి ఉద్యోగం, అధికారం, పదవితో సంబంధం లేదని చాటుతున్నారు ఈ యువత. ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా ఉన్న సుమారు 25 మంది డిగ్రీ విద్యార్థులు నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములవుతు న్నారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నారు. రోడ్డు దాటలేని వృద్ధులు, పిల్లలు, పల్లె ప్రజలకు చేయి అందిస్తున్నారు. వీరి సేవలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తున్నాయి.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్





ఎన్నిసార్లు చెప్పినా మారకపోతే ఎలా...?

● ఎంహెచ్‌వోపై మండిపడ్డ కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'ఏంటండీ ఈ చెత్తంతా.. కాలువల్లో క్లీనింగ్ ఇలాగేనా చేసేది..?, మీకు ఎన్నిసార్లు చెప్పాను...? ఇలాగైతే నా దగ్గర కుదరదు..!' అంటూ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ చైతన్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బాలాజీనగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్ అక్కడి నుంచి కపాడిపాళెంకు చేరుకున్నారు. కాలువల్లో చెత్త పేరుకుపోవ డాన్ని గుర్తించి, ఆ చెత్తనంతా బయటకు తీయించి ఎంహెచ్‌వోకు చూపారు. కాలువల్లో మొక్కలు కూడా మెలిచేంతగా సిల్ట్ ఉందంటే చెత్త అస్సలు తీయడం లేదని తెలుస్తోందంటూ మండిపడ్డారు. అవసరమైన చోట ప్రైవేట్ కూలీలతో శుభ్రం చేయించమని చెప్పినా చేయకపోతే ఏలాగని నిలదీశారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయంలోని కుక్కల పరి రక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక శరణార్థుల కేంద్రంలోని నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల నుంచి ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కాస్మెటిక్స్ వస్త్రాలు అందించాలని సూచించారు.



కాలువలో పేరుకున్న చెత్తను చూపుతున్న కమిషనర్

వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలి

● పెంపుడు కుక్కలకూ లైసెన్సు ఉండాలి : ఏడీసీ

నెల్లూరు(సిటీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారులంతా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని ఏడీసీ నందన్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సచివాలయ శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ వ్యాపారి ట్రేడ్ లైసెన్సు పొంది ఉండాలన్నారు. ఆ వివరాలను ఎంఎస్ఎంఈ సర్వేలో పొందుపరచాలని సూచించారు. లైసెన్సు లేని వారందరికీ నోటీసులు జారీ చేసి ఫిబ్రవరి ఆఖరులోపు లైసెన్సు పొందే ప్రక్రియ పూర్తి చేయాలని, లైసెన్సులు తీసుకోని వారికి మార్చి తరువాత జరిమానా విధించాలని ఆదేశించారు. పెంపుడు కుక్కల యజమానులు కూడా లైసెన్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో పాల్గొన్నారు.

మహిళలు, బాలల సంరక్షణే ధ్యేయం

● మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలు, బాలబాలికల సంరక్షణే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తోందని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కేహెచ్ రామారావు వెల్లడించారు. బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మహిలళపై జరుగుతున్న నేరాలు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, టీడీ సుబ్బారావు, ఎస్ఐ భాస్కర్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వసుంధరాదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

'రత్నం'లో క్రీడా మహోత్సవం

నెల్లూరు(విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం డాక్టర్ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ క్రీడా మహోత్సవాన్ని నిర్వహించారు. ఆ విద్యా సంస్థల జీఎం రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందు కు, శారీరకంగా, మానసికంగా బలోపేతం అయ్యేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. తాము విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూనే వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అతిథులు గౌరవవందనం స్వీకరించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

రోడ్డు, కాలువ పనుల ప్రారంభం

నెల్లూరు రూరల్, జనవరి 22,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 35వ డివిజన్ నీలగిరి సంఘంలో రూ.38 లక్షలతో మొదలపెట్టబోతున్న సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువ పనులకు బుధవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంతానికి గడప గడప కార్యక్రమంలో తన సోదరుడు గిరిధర్‌రెడ్డి వచ్చినప్పుడు రోడ్లు, కాలువలు లేవని స్థానికులు తెలిపారన్నారు. ఈ క్రమంలో పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

పాతవెల్లంటిలో గడప గడపకు..

మండలంలోని పాత వెల్లంటి గ్రామంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గడప గడప కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియచేశారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరు సంక్షేమ పథకాల్లో సభ్యులుగా ఉండాలని అక్కడున్న సచివాలయ ఉద్యోగులకు సూచించారు.

వైద్య ఉద్యోగికి పరామర్శ

నెల్లూరు (వైద్యం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వైద్య ఉద్యోగి రమణయ్యను హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు పరామర్శించారు. నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్న బాధితుడిని బుధవారం పరామర్శించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ మాధవ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐ ఉపకరణాల వితరణ

నెల్లూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్బీఐ ఉపకరణాలను బుధవారం వితరణ చేసింది. సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అధికారులు వీల్‌చైర్, స్ట్రెచర్, వెయింటింగ్ చైర్, 30 కుర్చీలు, రెండు బీరువాలతో పాటు పలు ఉపయోగకరమైన వస్తువులను వైద్యులు బలరాంనాయక్, హజరత్‌రెడ్డికి అందజేసింది. వీటిని ఎస్బీఐ అవేర్ గ్రూప్ ఛైర్మన్ మాధవన్, పీడీ వరుణ్ సహకారంతో అందచేస్తున్నట్లు బీఎం కొండమ్మ తెలిపారు.

గుర్తుంపు సంబరాలు

జనసేన కార్యాలయంలో వేడుకలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో జనసేన పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం చేర్చడంతో బుధవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సంబరాలు చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడు తూ కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీకి గాజు గ్లాసు గుర్తును ఖరారు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోవూరు ఇన్‌చార్జి చప్పిడి శ్రీనివాసులురెడ్డి, కృష్ణ, పెన్నా రీజినల్ కోఆర్డినేటర్లు కోలా విజయలక్ష్మి, నాగరత్నం యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ అలియా, తదితరులు పాల్గొన్నారు.

కాగా, నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారాల్లో 'జనవాణి' నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గాజు గ్లాసు గుర్తును శాశ్వతంగా కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందర్ రామిరెడ్డి, కారంపూడి కృష్ణారెడ్డి, వేటూరి రవి తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో జనసేన పార్టీ నాయకులు

ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దు : ఎంపీపీ

నెల్లూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు రానివ్వకుండా అధికారులు శాఖల వారీగా పాలన అందించాలని నెల్లూరు రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రాబోయే వేసవిలో తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా చూడాలని సూచించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడమేకాక ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలేంద్రకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ విజయకుమార్

గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు వర్ధంతి సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర విద్యాలయంలో బుధవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాహిత్య క్యాలెండర్ ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అరసం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ క్యాలెండరు ప్రాముఖ్యతను, కాలం విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెరుగు రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అరసం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, సుబ్బమ్మ, గిరిజ పాల్గొన్నారు.

మహమ్మదాపురం పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలు

పొదలకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాపురంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన అవేర్ గ్రూప్ (అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్) ఛైర్మన్ మాధవన్ జీ, ప్రాజెక్టు డైరెక్టర్ పి వరుణ్ కోరారు. బుధవారం అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ వారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో మహమ్మదాపురం పీహెచ్‌సీకి హైడ్రాలిక్ బెడ్, కాట్, వీల్ చైర్స్, ఆపరేషన్ థియేటర్ టేబుల్, తదితర రూ.2 లక్షలు విలువచేసే అత్యాధునిక వైద్య పరికరాలు అందజేశారు. ఈకార్యక్రమంలో పొదలకూరు ఎస్‌బీఐ మేనేజర్ పిఎస్ రాజు, వైద్యాధికారులు డాక్టర్ వి నరసింహారావు, డాక్టర్ వి శ్రీకావ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు ప్రత్యక్ష సేవలు

● పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్‌నాయుడు

వెంకటాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంచార పశు వైద్య సేవా వాహనాల ద్వారా పాడిరైతులకు ప్రత్యక్ష సేవలు అందిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టీ దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలోని కసుమూరు గ్రామంలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పశువైద్య శిబిరాల ద్వారా ఈనెల 31వ తేదీ వరకు రైతులకు సేవలు అందించనున్నట్లు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విడవలూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య శాఖ ఏడీఏ చంద్రమౌర్య తెలిపారు. మండలంలోని వావిళ్ల, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో అయన పాల్గొని రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు,సేవలను వివరించారు. ఈనెల 30 వరకు గ్రామ పంచాయతీల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏటూరు హరిరెడ్డి, తాతా ప్రభాకర్, బండ్ల గోవర్ధన్, పశువైద్యులు వాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి అధికారులే కీలకం

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఆగిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాల్సివారు, సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకునేవారి కోసం సర్వే చేపట్టి, ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో గ్రామస్థాయిలో అధికారులే కీలకమని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు,ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పొంతనలేని వివరాలుంటే విచారించి, న్యాయం చేకూర్చే అవకాశం గ్రామస్థాయి అధికారులకే ఉందన్నారు. ఆగిన ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తే, 10రోజుల్లోనే బిల్లులు పడతాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఏఈ చిన పెంచలయ్య, వర్క్‌ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠును ముందే గుర్తిస్తే నయం చేయవచ్చు : ఏడీఎంహెచ్‌వో

వెంకటాచలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యసేవలు అందిస్తే ఆరుమాసాల్లో పూర్తిగా నయమవుతుందని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. వెంకటాచలం సచివాలయం పరిధిలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి సర్వే ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి లక్షణాల్లో భాగంగా స్పర్శలేని రాగి రంగు మచ్చలను గుర్తించినట్లయితే కసుమూరు పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించాలన్నారు. కుష్ఠు వ్యాధి నరాలకు, చర్మానికి, కళ్లకు సోకినప్పుడు అంగవైకల్యం సంభవిస్తుందన్నారు. చికిత్స అందించడం ద్వారా త్వరితగతిన వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామసుబ్బారెడ్డి, ఏఎన్ఎం సుగుణ, ఎంఎల్‌హెచ్‌పీ బుజ్జమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.

డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

నెల్లూరు(క్రైం), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల వాహన డ్రైవర్లకు స్థానిక ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు బుధవారం అవగాహన కల్పించారు. ఎస్‌వీజీఎస్ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది. డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సూచించారు.

దేగపూడి-బండేపల్లి కాలువ పూర్తి చేస్తాం : సోమిరెడ్డి

మనుబోలు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మెట్ట రైతుల కల దేగపూడి-బండేపల్లి కాలువకు నిధులు మంజూరుచేయించి పూర్తిచేయిస్తానని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వడ్లపూడి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచు పల్లేటి రమాదేవి, టీడీపీ నాయకులు ధనెంకుల రఘురామనాయుడు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019లో తాను మంజూరు చేయించిన దేగపూడి-బండేపల్లి కాలువను గత ఎమ్మెల్యే ఆపేశారని, మరలా ప్రభుత్వ పెద్దలతో ఒప్పించి, నిధులు మంజూరు చేయించి కాలువను పూర్తిచేయించే బాధ్యత తనదేనన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సురేష్‌నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, రఘురామనాయుడు, పల్లేటి సుమన్, మధునాయుడు, ఎంపీడీవో జలజాక్షి, అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

రమణయ్య మృతి బాధాకరం

మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాపన రమణయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. ఇటీవల రమణయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలికి వేణుగోపాల్ రెడ్డి, పొన్నూరు అశోక్, సుమన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ పోటీలకు సాయి యశ్వంత్

విడవలూరు, జనవరి 22,(ఆంధ్రజ్యోతి): ఏపీ అండర్ -14 క్రికెట్ పోటీలకు నెల్లూరుకి చెందిన సాయి యశ్వంత్ ఎంపికయ్యాడు. నెల్లూరు హరనాథ పురంలో నివాసం ఉంటున్న ప్రళయకావేరి రాజేష్-మైథిలీ దంపతుల కు మారుడు సాయి యశ్వంత్ ఓ ప్రైవేట్ పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్నాడు చిన్నతనం నుంచి క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న సాయి యశ్వంత్‌ని తల్లితండ్రులు ప్రోత్సహించి కావలిలోని ఓ ప్రైవేట్ క్రికెట్ అకాడమిలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఇటీవల కడపలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో సాయి యశ్వంత్ పాల్గొని ప్రతిభ కనబరిచాడు. దీంతో రాష్ట్ర క్రికెట్ అకాడమీ సభ్యులు సాయి యశ్వంత్‌ని ఈనెల 27న పుదుచ్చేరిలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ జట్టుకి ఎంపిక చేశారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

- అక్రమ రవాణాలో అజ్ఞాత వ్యక్తి
- చికెన్ వేస్ట్ సరఫరా, చేపలకు ఆహారంపై ఎనిమిదేళ్ల కిందటే నిషేధం
- తహసీల్దారు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- అయినా, అడ్డుకోవడానికి వెనకడుగు



కోడిబొచ్చు కథలో కొత్త ట్విస్ట్





తిరుపతిలో సేకరిస్తున్న చికెన్ వ్యర్థాలు

'కోడి బొచ్చు' కథ కొనసాగుతూనే ఉంది. కాకుంటే కొత్త ట్విస్టులు బయటపడుతున్నాయి. వైసీపీ హయాంలో చికెన్ వ్యర్థాల మాఫియా బాగోతాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లేలా ఓ అజ్ఞాత వ్యక్తి పావులు కదపడంతో గుట్టు రట్టయింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ అజ్ఞాత వ్యక్తే చికెన్ వేస్టును తన చేతుల్లోకి తీసుకుని చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ప్రత్యామ్నాయ చర్యలకు కార్పొరేషన్ కసరత్తు

ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కోడిబొచ్చు కథ ముగియలేదు' కథనంపై కార్పొరేషన్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. చికెన్ వేస్ట్‌ను మీట్‌మీల్‌గా మారిస్తే అటు కార్పొరేషన్‌కు ఆదాయంతో పాటు ఇటు వ్యర్థాలను చేపల చెరువులకు తరలించకుండా ఆపొచ్చని భావించింది. వాటిని ఇప్పటికిప్పుడు తరలించకుండా నిలిపివేస్తే ఆ భారం తమపై పడుతుండడంతో శాశ్వత పరిష్కారం కోసం అధికారులు మార్గాలు అన్వేషిస్తున్నారు. మీట్‌మీల్‌కు అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేసేపనిలో పడ్డారు. రూ.25 లక్షలతో ప్లాంట్ ఏర్పాటు చేయవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీనికంటే ముందు ఇన్సినిరేటర్ ద్వారా చికెన్ వేస్ట్‌ను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

తిరుపతిలో నాలుగైదు చికెన్ షాపులున్నాయతడికి. చికెన్ వ్యర్థాలతో లాభాలను గతంలోనే ఆయన రుచి చూశారు. వైసీపీ ప్రభుత్వంలో డిమాండు పెరగడంతో ఆయన తప్పుకోవాల్సి వచ్చింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల ముందు కోడిబొచ్చు బాగోతాన్ని కూటమి నేతల చెవిన వేశారు. వీరు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చికెన్ వేస్ట్ మాఫియా గురించి ప్రజాగళం సభలో పవన్ కల్యాణ్ ప్రముఖంగా మాట్లాడటంతో సర్వత్రా చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు ఎవరైతే చికెన్ వేస్ట్ మాఫియా గురించి లీకు ఇచ్చారో.. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయనే ఆ మాఫియాను చేతుల్లోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

'వేస్ట్' వెహికల్స్‌ను పట్టుకుని వదిలేసిన పోలీసులు

తిరుపతి నుంచి చికెన్ వేస్ట్‌ను నెల్లూరుకు తరలిస్తున్న 6 మినీట్రక్కులను ఇటీవల కార్పొరేషన్ సిబ్బంది సహకారంలో పోలీసులు పట్టుకున్నారు. మాఫియాను నడిపిస్తున్న వ్యక్తి పైస్థాయిలో పోలీసులమీద ఒత్తిడి తీసుకురావడంతో వాటిని విడిచిపెట్టినట్టు తెలుస్తోంది. దీంతో తనకు అడ్డేలేదన్నట్టుగా యథేచ్ఛగా ఆయన చికెన్ వేస్ట్ రవాణా సాగిస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

చెరువులో వేసే పౌల్ట్రీ వ్యర్థాలు, ఇతర కళేబరాలను చేపలు తినడం.. వాటిని మాంసాహార ప్రియులు భుజించడంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక, నీరు, నేల కలుషితమమై, ఆక్వా కల్చర్ కూడా దెబ్బంతింటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మత్స్య రైతుల సంఘం ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. చికెన్ వేస్ట్‌తో పాటు కుళ్లిన ఆహార పదార్థాలు చెడిపోయిన గుడ్లు, చర్మాలు తదితరాలను చేపల పెంపకంలో వినియోగించడానికి వీల్లేదని, అలాంటి వ్యర్థాలు రవాణా కూడా చేయకూడదని నిషేధిస్తూ 2016లోని టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో నెం.56) జారీచేసింది.

ఐదుగురితో కమిటీ ఏర్పాటు

తహసీల్దారు చైర్మన్‌గా, మత్స్యశాఖ అధికారి కన్వీనర్‌గా, ఎంవీఐ, సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, వీఆర్వో సభ్యులుగా.. ఐదుగురితో నాడు కమిటీని ఏర్పాటు చేశారు. వ్యర్థాలు రవాణా చేస్తున్నా, చేపల చెరువులో వేస్తున్నా కఠిన చర్యలు తీసుకోవడం, వాహన యాజమానులపై జరిమానా విధించడం ఈ కమిటీ ప్రధాన కర్తవ్యం.

కమిటీ ఇలా చేయాలి

కన్వీనర్‌గా వ్యవహరించే ఫిషరీస్ అధికారి తన పరిధిలో కోళ్లు, ఇతర వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగించే వాహనాలను గుర్తించి చర్య తీసుకునేందుకు సంబంధిత స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచి అక్కడకు వచ్చే వాహనాలను ఆపి సీజ్ చేసి ఫిషరీస్, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలి. దోషులకు వ్యతిరేకంగా శిక్షలు అమలు చేసేందుకు వీఆర్వో సహకరించాలి. ఈమొత్తం వ్యవహారం తహసీల్దారు నియంత్రణలో జరగాలి. కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖలతో కలెక్టర్ సమన్వయం చేస్తూ వ్యర్థాల నిషేధం అమలుకు క్రమం తప్పకుండా పర్యవేక్షించడం నాటి జీవో సారాంశం. వీరెవరూ చికెన్ వేస్ట్ తరలింపును పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

- తొక్కిసలాటపై న్యాయ విచారణ
- ఆందోళనలో అధికారులు
- మంచి నిర్ణయమంటున్న జనం



లోపాలేమిటి.. బాధ్యులెవరు?

తిరుపతి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగి పట్టెడలోని పద్మావతీ పార్కులో తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించిన అంశం ఉద్యోగవర్గాల్లో గుబులు రేపుతుండగా, సాధారణ జనంలో మాత్రం ప్రభుత్వ స్పందన పట్ల సానుకూలత వ్యక్తమవుతోంది. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ కేంద్రంలో ఈనెల 8న జరిగిన సంఘటన ఆరుగురి మృతికి దారితీసిన విషయం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం స్పందించారు. మరుసటి రోజు స్వయంగా తిరుపతి వచ్చారు. తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడలోని పద్మావతీ పార్కును సందర్శించారు. భద్రతా వైఫల్యంపై కలెక్టర్, ఎస్పీ, టీటీడీ ఈవోలపై ఆగ్రహం వ్యక్తం చేసి మందలించారు. టీటీడీ చరిత్రలోనే తొలిసారిగా పరిపాలనా భవనానికి సీఎం స్వయంగా వచ్చి కలెక్టర్, ఎస్పీ, టీటీడీ అధికారులు, పాలకమండలి చైర్మన్‌లతో సమీక్షించారు. ఆ వెంటనే ప్రాథమిక చర్యల్లో భాగంగా తొక్కిసలాట జరిగిన కేంద్రం వద్ద డ్యూటీలో వున్న క్రైమ్ డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వైఫల్యాలకు బాధ్యులుగా భావించి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, టీటీడీ జేఈవో గౌతమిలను బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు. జరిగిన ఘటనపై న్యాయ విచారణ చేయిస్తామని ఆరోజే వెల్లడించారు. అందులో భాగంగా రాష్ట్ర హైకోర్టు రిటైర్డు జడ్జి ఎం.సత్యనారాయణ మూర్తిని విచారణాధికారిగా నియమిస్తూ బుధవారం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. విచారణకు ఆరు నెలల గడువు విధించారు.

న్యాయవిచారణ ఇలా..

- తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులు ఏమిటని గుర్తించడం
- ఘటన జరిగిన కేంద్రంలో ఏర్పాట్లు తగినవిధంగా వున్నాయా? లోపాలుంటే అందుకు బాధ్యులు ఎవరు అని గుర్తించడం.
- భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడం.
- తిరుమల,తిరుపతిల్లో భక్తుల భద్రతకు వ్యవస్థాగతంగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడం.

శభాష్ సీఎం!

తొక్కిసలాట ఘటనకు పోలీసు, రెవిన్యూ, టీటీడీ, మున్సిపల్ యంత్రాంగాలలో ఎవరెవరు ఏయే స్థాయిల్లో బాధ్యులో న్యాయవిచారణలో తేలనుంది. ఘటన జరిగిన 15 రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి న్యాయ విచారణకు ఆదేశించడం పట్ల సామాన్య జనంలో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. తొక్కిసలాట ఘటన జరిగిన రోజు, మరుసటి రోజు సీఎం స్పందించిన తీరు.. ప్రత్యర్థులను కూడా నోరు తెరవకుండా చేసింది. తనకు సన్నిహితులుగా ముద్ర పడిన అధికారులపై కూడా ఆయన మొహమాటాలకు పోకుండా చర్యలు తీసుకోవడంతో ఆయన ఈ సంఘటనను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం అవుతోంది. మృతుల కుటుంబాలకు పరిహారాలు, టీటీడీలో ఉద్యోగాలు వంటి నిర్ణయాలు తీసుకున్న తర్వాత కూడా ఈ ఘటనను నీరుగార్చే ప్రయత్నం చేయకుండా సీఎం అదే తీవ్రత కొనసాగించడం చర్చగా మారింది.

అధికారుల్లో గుబులు

న్యాయ విచారణకు ఆదేశిస్తూ బుధవారం నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో తిరుపతి పోలీసు, రెవిన్యూ, టీటీడీ అధికార వర్గాల్లో గుబులు మొదలైంది. టోకెన్ల జారీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి జిల్లా రెవిన్యూ, పోలీసు, టీటీడీ యంత్రాంగాల్లో ఉన్నతాధికారుల నుంచీ కిందిస్థాయి ఉద్యోగుల వరకూ పలువురి ప్రమేయం తప్పనిసరి. ఎవరి పరిధిలో వారు తమ విధులను బాధ్యతతో నెరవేర్చాల్సి వుంటుంది.. సాధారణ శాఖపరమైన విచారణలు అయితే అధికారులు, ఉద్యోగులు పెద్దగా ఆందోళన చెందే పరిస్థితి లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా హైకోర్టు రిటైర్డు జడ్జితో న్యాయ విచారణకు నిర్ణయం తీసుకోవడంతో బైరాగిపట్టెడలోని టోకెన్ల జారీ కేంద్రం వద్ద విధులకు సంబంధించి ప్రమేయమున్న అధికారులు, ఉద్యోగులు ఆందోళనకు లోనవుతున్నారు. న్యాయ విచారణ ముగిసి నివేదికలో వైఫల్యాలకు ఎవరు బాధ్యులవుతారో అని చర్చించుకుంటున్నారు.

వీరజవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- పరిసర గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన యువకులు, విద్యార్థులు
- అండగా ఉంటామని కలెక్టర్ భరోసా



అంత్యక్రియలకు ఊరేగింపుగా వెళుతున్న జనం



కార్తీక్

కార్తీక్ మృతదేహంపై జాతీయ జెండా కప్పుతున్న సైనికులు

బంగారుపాళ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మూ, కశ్మీర్‌లో ఉగ్రవాదులు, సైనికుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన యువ జవాన్ కార్తీక్ అంత్యక్రియలు తన స్వగ్రామమైన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం ఎగువ రాగిమానుపెంటలో బుధవారం సాయంత్రం 3.45 గంటలకు పూర్తయ్యాయి. బెంగళూరు నుంచి రోడ్డు మార్గం ద్వారా ఆర్మీ వాహనాల్లో కార్తీక్ భౌతికకాయాన్ని ఉదయం 6 గంటలకు ఆర్మీ అధికారులు తీసుకొచ్చారు. అతడి స్నేహితులు, గ్రామస్తులు బంగారుపాళ్యం నుంచి ఎగువ రాగిమానుపెంట గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్తీక్ భౌతికకాయాన్ని చూడగానే తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు, అన్న రాజేష్‌తో పాటు బంధుమిత్రులు భోరున విలపించారు. వీరజవాన్ కార్తీక్‌ను చివరిచూపు చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున యువత, విద్యార్థులు తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు ఎగువ రాగిమానుపెంటకు చేరుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు కార్తీక్ భౌతిక కాయానికి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కార్తీక్ మరణ వార్త తెలిసిన వెంటనే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే మురళి అన్నారు. కార్తీక్ నివాసం ఉంటున్న కాలనీకి ఆయన పేరు పెట్టేలా ప్రతిపాదించామన్నారు. ఆయన చదువుకున్న పాఠశాలలో విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం, అతడి తల్లిదండ్రుల పేరిట ఐదు ఎకరాలు, ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేందుకు సీఎం కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. జీజేఎం ట్రస్టు ద్వారా రూ.50వేల చెక్కును కార్తీక్ తండ్రి వరదరాజులుకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అందజేశారు. కార్తీక్‌కు సంబంధించిన వస్తువులను, రికార్డులను అతడి తల్లిదండ్రులకు ఆర్మీ అధికారులు అప్పగించారు.



కార్తీక్ భౌతికకాయం వద్ద సెల్వికి కలెక్టర్ పాదాభివందనం

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

గూర్ఖా రైఫిల్స్ బెటాలియన్ లెఫ్టినెంట్ శివరాజ్‌సింగ్ గిల్ ఆధ్వర్యంలో వీరజవాన్ కార్తీక్ భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనం చేశారు. భౌతికకాయాన్ని ఆర్మీ వాహనంలో ర్యాలీగా గ్రామవీధుల మీదుగా తీసుకెళ్లి వారి మామిడి తోటలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్లు గాలిలోకి మూడు సార్లు కాల్పులు జరిపారు.

హలో.. మేము సీబీఐ

- సరికొత్తగా సైబర్ నేరాలు
- నిందితుడిని అరెస్టు చేసిన తిరుపతి పోలీసులు

-4లో

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



తొలిరోజు 89మంది గైర్హాజరు

-4లో

'గీత' కార్మికులకు

23 మద్యం దుకాణాల కేటాయింపు

- అత్యధికంగా ఈడిగకు 15 దుకాణాలు
- నోటిఫికేషన్ జారీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీల్లో భాగంగా 'గీత' కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పింది. వీరికి జిల్లాలో 23 మద్యం దుకాణాలను కేటాయించింది. అందులో ఈడిగలకు అత్యధికంగా 15 కేటాయించారు. ఇక గౌడుకు మూడు, గౌడకు రెండు, గౌండ్లకు మూడు దుకాణాలు కేటాయించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. కలెక్టర్ నేతృత్వంలో లాటరీ తీసి లైసెన్సులకు ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు కుల, నేటివిటీ, ధృవపత్రాలు సమర్పించాలని నోటిఫికేషన్‌లో పొందుపరచారు. ఒక్కో దుకాణానికి ఫీజు రూ.రెండు లక్షలు నాన్ రీఫండబుల్ కింద చెల్లించాలి. ఒక అభ్యర్థి ఆయా ప్రాంతాల్లో కేటాయించిన అన్ని దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వీలుంది. కానీ ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకరికి ఒక షాపు మాత్రమే కేటాయిస్తారని జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి చెప్పారు. ఎవరికైనా ఒక్కటి కంటే ఎక్కువ దుకాణాలు వస్తే ఏదో ఒకటి మాత్రమే ఎంపిక చేసుకోవాలన్నారు. రెండేళ్ల కాలానికి లైసెన్సులు మంజూరు చేయనున్నారు.

ఎమ్మెల్యే డ్రైవింగ్..

వెనుక కలెక్టర్



చంద్రగిరి మండలం తొండవాడ ఎన్టీఆర్ కాలనీలో రూ.12.82 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టరును ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఎమ్మెల్యే కాలనీ కల్వర్టు పనుల పరిశీలనకు వెళ్లారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



శ్రీహరిసేవలో మేలుకోట్ మఠాధిపతి

మేలుకోట్ మఠాధిపతి యదుగిరి యతిరాజ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు. అలాగే బిగ్‌బాస్ ఫేం నటి అశ్వినిశ్రీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు యతిరాజ స్వామిజీ - అశ్వినిశ్రీ

చిత్రకూట్‌లో వైభవంగా శ్రీనివాసకల్యాణం

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్ నగరంలో ఉత్తరాది అహోబిలం మఠంలో బుధవారం ఉదయం శ్రీనివాస కల్యాణాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం 11 నుంచి 12 గంటల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1008 రాజ్ గురు పీఠాధీశ్వర్ స్వామి బద్రి ప్రసన్నాచార్యజీ మహరాజ్, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు

తిరుమల, జనవరి22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30న ప్రారంభమైన అధ్యయనోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. 25 రోజుల్లో ఆళ్వార్ దివ్యప్రబంధంలోని 4 వేల పాశురాలను శ్రీవైష్ణవులు స్వామివారి ఆలయంలోని రంగనాయక మండపంలో పారాయణం చేశారు. నేడు తణ్ణీరముదు ఉత్సవంతో అధ్యయనోత్సవాలు ముగుస్తాయి.


శ్రీహరి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: **రూ.4.04 కోట్లు**

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **60,581**

తలనీలాలు సమర్పించినవారు: **19,228**



మల్లిమడుగులో మళ్లీ మట్టి తవ్వకాలు

- మైనింగ్ శాఖ పేరుతో చెక్‌పోస్టు
- చోద్యం చూస్తున్న అధికారులు



మల్లిమడుగు రిజర్వాయరు పరిసరాల్లో ఎక్స్‌కవేటర్‌తో టిప్పర్‌లో నింపుతున్న మట్టి

రేణిగుంట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరులో మళ్లీ అక్రమ మట్టి తవ్వకాలు మొదలయ్యాయి. ఏకంగా మైనింగ్ శాఖ సిబ్బంది అంటూ అనధికారికంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి రాత్రీపగలు టన్నుల కొద్దీ మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నెల నుంచి ఇక్కడినుంచి పలక మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు వెలువడ్డాయి. స్పందించిన తహసీల్దారు సురేష్‌బాబు మూడు నెలల క్రితం ఈ ప్రాంతాన్ని తొ ని ఖీ చేశారు. టిప్పర్లు, లారీలు వెళ్లకుండా ప్రత్యేకంగా మూడు చోట్ల కందకాలను తవ్వించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. అయితే గడిచిన నెల రోజులుగా రాత్రి సమయంలో మాత్రం గుట్టుచప్పుడు కాకుండా టిప్పర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఇటీవల పది రోజులుగా రేణిగుంట, కడప ప్రధాన రహదారిలోని ఆంజనేయపురం చెక్‌పోస్టు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మల్లిమడుగు రిజర్వాయరులోకి వెళ్లే మట్టిరోడ్డు వద్ద ప్రత్యేక చెక్‌పోస్టును తలపించేలా ఇనుప రేకులతో రూమును ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో యువకులను ఉంచారు. వీరు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. మల్లిమడుగు రిజర్వాయరు నుంచి వెళ్లే లారీ నెంబర్లను బిల్లులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ ఉంటారు. ఈ యువకులను ప్రశ్నించగా తాము మైనింగ్ శాఖకు సంబంధించిన వాళ్లమని కడప వైపు నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తామని చెప్పుకొచ్చారు. అయితే మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తరలింపునకు అనధికారికంగా వేలం నిర్వహిస్తే తిరుపతికి చెందిన కొంతమంది అధిక మొత్తంలో పాడుకున్నట్టు తెలుస్తోంది. ఇక్కడి మట్టిని తిరుపతి, చంద్రగిరి, పాకాల, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పుత్తూరు, నగరి ప్రాంతాలకు ప్రతి రోజు తరలిస్తున్నారు. ఈ లారీలు ఇప్పటి వరకు నిత్యం ఈ రహదారిలో విధులు నిర్వహించే బ్రేక్ ఇన్‌స్పెక్టర్, పోలీసులకు కనపడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా మట్టి, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మైనింగ్ శాఖ అధికారులు, మండల పోలీసులు, రెవెన్యూ, మండల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళితే కొంతైనా ఈ అక్రమ రవాణాన్ని కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారి బాలాజీని వివరణ కోరగా మల్లిమడుగు రిజర్వాయర్ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని స్పష్టం చేశారు.



చెక్‌పోస్టు వద్ద మైనింగ్ శాఖ సిబ్బందిగా చెబుతున్న యువకుల ఫొటోలు తీస్తుండగా జారుకుంటున్న దృశ్యం



మట్టి అక్రమ తరలింపునకు ముద్రించిన బిల్లు

జిల్లాకు 79 కొత్త ఆర్టీసీ బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 10 డిపోలకు 79 నూతన ఆర్టీసీ బస్సులు వచ్చాయి. ఇందులో ఆర్టీసీ సొంత బస్సులు 50, అద్దె బస్సులు 29 ఉన్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు వివిధ రూట్లలో తిరుగుతుండగా కొన్ని మాత్రం రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్నాయి. అవి కూడా ఈ వారంలో రోడ్డెక్కుతాయని డీపీటీవో నరసింహులు తెలిపారు.

సొంత బస్సులు: అల్ట్రా డీలక్స్- తిరుపతి డిపోకు 2, సూపర్‌లగ్జరీ- తిరుపతి 7, వెంకటగిరి 6, శ్రీకాళహస్తి 3, మంగళం, సత్యవేడు ఒక్కొక్కటి, ఎక్స్‌ప్రెస్‌లు-వాకాడు 12, గూడూరు, వెంకటగిరి 9చొప్పున.

అద్దె బస్సులు: సూపర్‌లగ్జరీ-తిరుపతి 2, ఎక్స్‌ప్రెస్‌లు-తిరుపతి 3, వెంకటగిరి 10, గూడూరు 1, వాకాడు 4. పల్లెవెలుగు-శ్రీకాళహస్తి 1, సత్యవేడు 3, వెంకటగిరి 2, గూడూరు 3.

ఉపసర్పంచి కుటుంబానికి పరిహారం అందజేత



చంద్రగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో ఇటీవల మృతి చెందిన కందులవారిపల్లె పంచాయతీ ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి కుటుంబానికి అటవీశాఖ నష్టపరిహారం ప్రకటించింది. పరిహారం కింద రూ.10 లక్షల చెక్కును ఆ శాఖ అధికారులు బుధవారం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి,ఎఫ్ఆర్వో అనిత, ఎఫ్‌బీవో చిత్ర, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా తదితరులు పాల్గొన్నారు.





కమ్మలు తీసిస్తూ.. - మెడలో గొలుసు తీసిస్తున్న విద్యార్థిని

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

- తొలిరోజు 89మంది విద్యార్థులు గైర్హాజరు

తిరుపతిరూరల్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలివిడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9-12గంటలు, మధ్యాహ్నం 3-6గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు తొలిరోజు 2326మంది విద్యార్థులకుగాను 2237 మంది హాజరై పరీక్ష రాశారని సిటీకోఆర్డినేటర్ టిక్కైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 89మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదన్నారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి కేంద్రాలోకి అనుమతించారు. చెవిలో కమ్మలు, మెడలో గొలుసులు, కాళ్ల వద్ద డ్రెస్‌కు దారాలుంటూ వీటినీ తీసేయించారు. నిర్ణీత సమయానికి కేంద్రాల వద్ద ప్రధాన గేటును మూసివేశారు. జిల్లాలో తిరుపతిరూరల్‌మండలం జూపార్క్‌రోడ్డు (చెర్లోపల్లె)లోని అయాన్‌డిజిటల్, చంద్రగిరిమండలంలో రామిరెడ్డిపల్లెలోని కేఎంఎం, కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల కేంద్రాలను కేటాయించారు. కాగా చెర్లోపల్లెలోని అయాన్‌డిజిటల్ కేంద్రం వద్ద ఉదయం 7గంటల నుంచి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి నెలకొంది. విద్యార్థులు దాదాపుగా సకాలంలో కేంద్రాలకు చేరుకోవడం జరిగింది. ఆలస్యంగా వచ్చి వెనుతిరిగిన సంఘటనలు చోటుచేసుకోలేదు. సహాయకులుగా వచ్చిన వారు విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెబుతూ కనిపించారు. కాగా తొలిరోజు నిర్వహించిన పరీక్షలో ప్రశ్నాపత్రం ఈజీగా ఉందని కొందరు విద్యార్థులు అంటుండగా.. మరికొందరు గణితం, ఫిజిక్స్ సబ్జెక్టుల ప్రశ్నలు కొంత కఠినంగా, కెమిస్ట్రీ ప్రశ్నలు కొంత ఈజీగా ఉన్నాయని చర్చించుకుంటూ కనిపించారు.



తిరుపతి నగరం జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో విద్యార్థులు

హలో.. మేము సీబీఐ

- మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామంటూ వృద్ధురాలికి బెదిరింపు
- రూ.2.5 కోట్లు లాగేసుకున్న సైబర్ నేరగాళ్లు
- కేసు పెట్టిన పది రోజుల్లోనే నిందితుడి అరెస్టు
- రూ.24.5 లక్షల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'హలో.. మేము సీబీఐ' అంటూ డిజిటల్ అరెస్టుల పేరిట సైబర్ నేరగాళ్లు బెదిరిస్తున్నారు. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారంటూ.. తిరుపతిలో ఓ 65 ఏళ్ల మహిళను భయపెట్టారు. ఆమె నుంచి రూ.2.5 కోట్లు లాగేశారు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వెస్ట్ పోలీసులు రాజమహేంద్రవరానికి చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేశారు. ఈ వివరాలను బుధవారం సాయంత్రం ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ చందోలు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన పాలకొల్లు అరుణ్‌వినయ్‌కుమార్ ఎంబీఏ చదివాడు. ఈజీ మనీ కోసం దారులు వెదికాడు. వాట్సాప్ కాల్స్ ద్వారా అమాయకులను బెదిరించి వివిధ అకౌంట్లకు డబ్బులు వేసుకునేవాడు. ఇలా తిరుపతికి చెందిన 65 ఏళ్ల మహిళకు గతేడాది డిసెంబరులో వాట్సాప్ కాల్ వచ్చింది. తాను ఢిల్లీలో సీబీఐ అధికారినని చెప్పాడు. రూ.200 కోట్ల మనీలాండరింగ్ చేశావని, నీపై సీబీఐ కేసు నమోదైందని బెదిరించాడు. బ్యాంకు అకౌంట్ల నుంచి చట్ట వ్యతిరేకంగా వివిధ కార్యకలాపాలకు నగదు వాడుతున్నందున అరెస్టు చేస్తామని చెప్పాడు. ఇలా.. మరికొందరు సీబీఐ అంటూ ఆమెకు ఫోన్లు చేశారు. మీ అకౌంటులోని డబ్బులు తమకు పంపితే.. ఆ నగదు మనీలాండరింగ్‌లో ఉందా లేదా అనేది దర్యాప్తు చేస్తామని, లేకుంటే మీ ఖాతాలకు జమ చేస్తామన్నారు. ఆమెను మాయమాటలతో నమ్మించి దాదాపు రూ.2.5 కోట్లు వివిధ ఖాతాలకు జమచేసుకున్నారు. చివరకు తాను సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోయానని గుర్తించిన బాధిత మహిళ ఈ నెల 13న వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.



అంతర్జాతీయ సైబర్ నేరగాడు అరెస్టు చేసి నగదు, బంగారు నగలు స్వాధీనం చేసుకున్న తిరుపతి పోలీసులు

దర్యాప్తునకు ప్రత్యేక బృందాలు

ఈ కేసు దర్యాప్తునకు అదనపు ఎస్పీ వెంకట్రావు నేతృత్వంలో డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో సీఐలు వినోద్ (సైబర్ క్రైం), మురళీమోహన్ (వెస్ట్), ప్రకాష్‌కుమార్ (క్రైం), ఎస్ఐలు, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వాడిన సెల్‌ఫోను నెంబరు, బాధితురాలికి వచ్చిన వాట్సాప్ కాల్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఇలా బెదిరించి ఆన్‌లైన్ ద్వారా నిందితులు డబ్బులు కాజేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో కీలక నిందితుడు అరుణ్ వినయ్‌కుమార్‌ను బుధవారం రాజమహేంద్రవరంలో అరెస్టు చేసి తిరుపతికి తీసుకొచ్చారు. ఎస్పీ ఆధ్వర్యంలో మీడియా ముందు హాజరుపరిచారు. ఇతడి నుంచి కొత్త కారు, బ్యాంకులోని రూ24.5 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్ ఫోన్లు, 16 గ్రాముల బంగారు నగలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆరేడుగురు నిందితులున్నారని, వారికోసం గాలిస్తున్నారు. ఈ కేసులో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ అభినందించారు. వారికి రివార్డులు ప్రకటించారు.

నేడు సామూహిక సూర్య నమస్కారం

తిరుపతి(క్రీడలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్, వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు పరాక్రమ్ దివస్ సందర్భంగా శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ, వివేకానంద కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10వేల మందితో సామూహిక సూర్య నమస్కారం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో 12నుంచి 50 సంవత్సరాల లోపు వారు పాల్గొనవచ్చు. అల్పాహారం, యోగా పుస్తకం, శ్రీవారి ప్రసాదాలు అందజేస్తారు.

స్విమ్స్‌లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు వాయిదా

తిరుపతి(వైద్యం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రతి ఆదివారమూ ఉచితంగా నిర్వహించే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన చేపట్టాల్సిన పరీక్షలను వాయిదా వేశామని, ఫిబ్రవరి 2 నుంచి యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

తిరుపతిలో తమిళనాడు భక్తుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం విరుధనగర్‌కు చెందిన జయకన్నన్ (45) బుధవారం తిరుపతిలోని ఓ లాడ్జిలో మృతిచెందారు. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. కొంతకాలంగా మూర్ఛతో బాధపడుతున్న జయకన్నన్, మంగళవాం శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. తిరుపతి ఈస్ట్ పరిధిలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మద్యం తాగి పడుకున్న ఆయన ఎంతకీ బయటకు రాలేదు. సిబ్బంది తలుపులు తట్టినా స్పందించకపోవడంతో నిర్వాహకులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.11 లక్షలు కాజేసారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తిరుపతి యాదవకాలనీకి చెందిన పి.హేమలత వద్ద ముగ్గురు దాదాపు రూ.11లక్షలు కాజేశారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న ఈమెను కొందరు కలిశారు. డబ్బులిస్తే ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన లక్ష్మీనారాయణకు 6.57 లక్షలు, సనబోయిన వినీత్‌కుమార్‌కు రూ.2.15 లక్షలు, మారేడు నరేష్‌కుమార్‌కు రూ.2.40 లక్షలు పంపారు. ఎంతకూ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయానని గుర్తించిన ఆమె బుధవారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా వర్సిటీలో పరిశోధనా ప్రాజెక్టులో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టుకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి. 27న ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపీఈడీ, ఎమ్మెస్సీ హోంసైన్స్ చదువుకున్న వారు అర్హులు. ఇతర వివరాలకు ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్ చూడాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని కోరారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

డీఎస్‌డీవోలతో సమీక్షించిన శాప్ చైర్మన్



డీఎస్‌డీవోలతో సమీక్షిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సాహించి వారి ప్రతిభను గుర్తించే చర్యలు చేపడుదామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఎస్‌డీవోలు సయ్యద్‌సాహెబ్, బాలాజీలతో సమీక్షించారు. ఆర్థిక స్తోమత లేకుండా గ్రామీణ క్రీడాకారులు చదువులకే పరిమితవుతున్నారని, సత్తా ఉన్నా క్రీడల్లో వెనుకబడిపోతున్నారని గుర్తు చేశారు. అలాంటివారిని గుర్తించి దాతల సాయంతో చేయూతనందించే బాధ్యతలు తీసుకుందామన్నారు. గ్రామీణ పాఠశాలలలో పర్యటించి పీఈటీల ద్వారా క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను ఎంపిక చేయలన్నారు. అమరరాజ సంస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సహదేవనాయుడు ముందుకొచ్చి తాను సహకరిస్తానన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని, ఫలితాలను బట్టి ఇతర జిల్లాల్లోనూ అమలు చేద్దామని రవినాయుడు దిశానిర్దేశం చేశారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్న ఎమ్మెల్యే, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యమిస్తూ వైభవోపేతంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ముక్కంటి ఆలయ పరిపాలన భవనంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో తొలి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో బాపిరెడ్డితోను.. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక, వైద్య తదితర శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వామివారి గర్భగుడి వద్ద భైఠాయించి సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారు. వారి పార్టీ కార్యకర్తలను దళారులుగా మార్చారు. ఇప్పుడు అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తాం. భక్తులందరూ సులభంగా టిక్కెట్లు కొనుగోలు చేసేలా 14 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఈ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు అన్ని పత్రికల్లో బార్‌కోడ్ ద్వారా ప్రకటనలు ఇస్తాం. దీంతో ఆన్‌లైన్‌లోనూ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసేలా శ్రీకారం చుడుతున్నాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు.

10 లక్షల మందికి దర్శనం

వీఐపీల కోసం ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంపై కసరత్తు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో సుమారు 10లక్షల మంది భక్తులకు దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధారణ రోజుల్లో 750మందిని, కీలక రోజులుగా అదనంగా మరో 450మందిని బందోబస్తుకు కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం 175 మరుగుదొడ్లు ఉండగా, ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6 వరకు అదనంగా 200 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం పట్టణ పారిశుధ్య సిబ్బందితో పాటు పొరుగు మండలాలు, మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని బ్రహ్మోత్సవాలకు వినియోగిస్తామని వెల్లడించారు. పట్టణవ్యాప్తంగా సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షిస్తామన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక బృందాలను నియమిస్తామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో విద్యుత్, ఆహారం, తాగునీరు సరఫరాకు ఎక్కడా చిన్న ఆటంకం కూడా ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేక కార్యాలయాలు వెలవెల



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక ఖాళీ కుర్చీలు

సూళ్లూరుపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు బుధవారం అధికారులు లేక వెలవెలపోయాయి. సూళ్లూరుపేటలో సోమవారం వరకు మూడు రోజుల పాటు జరిగిన పక్షుల పండగ నిర్వహణ విధుల్లో అధికారులు పాల్గొన్నారు. పక్షుల పండగ ముగిసి రెండు రోజులైనా కార్యాలయాలకు రాలేదు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఒక్క అధికారి కూడా కనిపించలేదు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ గదుల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు పడిగాపులు కాచి వెనుతిరిగి వెళ్లారు. తహసీల్దారు సాయంత్రం 4 గంటలకు వచ్చి రాత్రి 7 గంటల వరకు కార్యాలయంలో ఉన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి. ఎంపీడీవోతో పాటు కార్యాలయ సిబ్బంది ఎవరూ రాలేదు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న గీత

నాయుడుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత విద్య అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు సిద్ధిస్తుందని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఏస్తేరు గీత అన్నారు. నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకులంలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం గురుకులాల్లోని విద్యార్థులకు అన్ని వసతులు, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యా బోధన జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు లేని దాదాపు 100 మంది విద్యార్థులకు, గురుకులంలోని పారిశుధ్యం, సెక్యూరిటీ సిబ్బందికి స్థానిక వైదేహి షాపింగ్ మాల్ యజమాని సుబ్బారెడ్డి అందజేసిన దుస్తులను డీసీవో అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గురుకులాలకు తనవంతు సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దాదాపీర్, పుదూరు ప్రిన్సిపాల్ రూత్ రమోలా, విక్రమ్, పద్మజ, శేఖర్‌బాబు, వెంకటకృష్ణయ్య, కాటయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోండి



డీఎస్పీ గీతాకుమారికి సమస్యలను విన్నవిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ, నాన్‌టీచింగ్ ఉద్యోగులు

గూడూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో నాన్ టీచింగ్ ఉద్యోగుల ప్రయోజనాలపై లేబర్‌కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కాలేజీ యాజమాన్యం పాటించేలా చర్యలు తీసుకోవాలని బుధవారం ఏఐటీయూసీ, సీపీఐ నాయకులతో పాటు నాన్‌టీచింగ్ ఉద్యోగులు డీఎస్పీ గీతాకుమారికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాన్‌టీచింగ్ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా అందించడం లేదన్నారు. వీటిపై గతంలో ఉద్యోగులు లేబర్ కోర్టుకు వెళ్లగా స్పష్టమైన ఆదేశాలను ఇచ్చి ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని నెలలుగా అపరిష్కృతంగా ఉన్న ఉదోగ్యుల సమస్యలను పరిష్కరిచేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేసి పరిష్కారానికి కృషి చేస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, చంద్రయ్య, వెంకటయ్య, బాబురావు, గౌస్‌బాష తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని కృషి విజ్ఞాన్ కేంద్రం, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, మునగ ఆకు పొడితో బిస్కెట్స్ తయారీపై బుధవారం మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అదానీ ఫౌండేషన్, కృష్ణపట్నం పోర్టు సౌజన్యంతో ఎస్‌హెచ్‌జీ మహిళలకు చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందని, వాటి ద్వారా తినుబండరాలు తయారు చేసి విక్రయిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త విజయశ్రీ, అదానీ ఫౌండేషన్ సభ్యులు సెల్వరాజ్, సాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో సీసీ రోడ్లు

ఓజిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.1.20 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నిధులు విడుదల చేయించడంతో టీడీపీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు నాయకులను సమన్వయం చేసుకుని సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

నేటి నుంచి 'ఉల్లాస్'

తడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ఉల్లాస్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వయోజన విద్య కార్యక్రమంలో చదువుకునే వారికి ప్రతిరోజూ సాయంత్రం తరగతులు నిర్వహిస్తామన్నారు. సైబర్ క్రైమ్, ఆర్థిక సమానత్వం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం అక్షర వెలుగు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజారెడ్డి, వెలుగు సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



మంగళంపాడు బ్రాహ్మణ వీధిలో నిర్మిస్తున్న కల్వర్టు - ఆత్రేయ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం - డ్రైన్ నిర్మాణానికి తవ్విన కాలువ

మంగళంపాడులో అభివృద్ధి పరుగులు

రూ.35 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు పంచాయతీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ, అధ్వానంగా ఉన్న దారులను బాగు చేసేందుకు సర్పంచు, టీడీపీ నాయకులు దృష్టి సారించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామంలో కనీసం నీటి కుళాయి కూడా వేయలేదు. చిన్నపాటి వర్షమొచ్చినా వీధుల్లో నీరు నిలచి మురికి కూపాన్ని తలపించేది. ఎట్టకేలకు సర్పంచు రుక్మిణి, టీడీపీ నాయకులు ఎంబేటీ సతీష్ చొరవ తీసుకొని 15 ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో ఆత్రేయకాలనీలో సీసీ రోడ్డు, గ్రామంలోని ప్రధాన వీధుల్లో రెండుచోట్ల రూ.2 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో రోడ్డు పలుచోట్ల గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో రూ.1.50 లక్షలతో మరమ్మతులు చేశారు. అంతేకాకుండా గ్రామంలో రూ.15 లక్షలతో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలు అందజేసిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చిట్టేడులో జ్వరాలపై ఆరా



ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో పద్మావతి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని రోగుల గదులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో జ్వర పీడితులపై ఆరా తీశారు. వైద్యాధికారులు డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ నాగరాజు ఆస్పత్రిలో సమస్యలను డీఎం అండ్‌హెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణి

కోట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పెంచాలని డీఎల్‌డీవో వాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లి, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో జ్వరాల నివారణకు, దోమలను తరిమికొట్టేందుకు ఫాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వేణు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజయదీపిక పుస్తకాల పంపిణీ

తడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను ఎంపీపీ కొలవి రఘురెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మల్లికార్జున, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు

బాలాయపల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లిలో చిన్నారులకు బుధవారం ఆధార్ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వినీల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి చిన్నారికి ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించడంతో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయించామన్నారు. గురువారం నిండలి సచివాయంలో ప్రత్యేక శిబిరం ఉంటుందని, ఆధార్ లేనివారు నమోదు చేయించుకోవాలని సూచించారు.

అన్నదానం

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 87మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 81మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దారు జయజయరావు పరిశీలించారు.

చెంగాళమ్మకు వెండి వస్తువుల బహూకరణ



సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి వెండి పాత్రలను అందజేస్తున్న ఇమ్మానేని దంపతులు

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి నైవేద్యానికి ఉపయోగించే వెండి పాత్రలను సూళ్లూరుపేటకు చెందిన ఇమ్మానేని చంద్రశేఖర రావు, చంద్రమతి, ఇమ్మానేని సత్యనారాయణ, బాబామని దంపతులు బహూకరించారు. బుధవారం రూ.7.50 లక్షల విలువ చేసే 6 కిలోల 400 గ్రాముల బరువు గల రెండు వెండి పాత్రలను సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మానేని శ్రీనివాసరావు దంపతులు, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు పాల్గొన్నారు.

బలిజ మహిళల అభ్యున్నతికి కృషి



యువతికి చీరలు, సారె అందజేస్తున్న బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద బలిజ యువతులు, మహిళల అభ్యున్నతికి బలిజ మహిళా సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. బుధవారం సైదాపురం మండలం ఆర్‌ఆర్‌పురం గ్రామానికి చెందిన చందన అనే యువతికి పెళ్లికి అవసరమైన చీరలు, సారెను అందజేశారు. ఈ సందర్భంగా సులక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని చందనకు తమ సంఘం ఆధ్వర్యంలో పెళ్లికి అవసరమైన పట్టు చీరలు, కొత్తబట్టలు, పరుపులు, దిండ్లు, అత్తవారి ఇంటికి అవసరమైన అన్ని వస్తువులను అందజేయడం జరిగిందన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో అర్హులైన పేద జలిజ మహిళలను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, అరుణ, ఉమాదేవి, ఉషా, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాట సభను విజయవంతం చేయండి



దామానెల్లూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూళ్లూరుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల పేరుతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకుడు కుక్కముల్లి రవి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని దామానెల్లూరు, మంగళంపాడు గ్రామాల్లో పర్యటించి ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రతిగ్రామం నుంచి అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రఘు, సార్థకుమార్, తిరుపాల్, కృష్ణయ్య, మహిళా మండలి అధ్యక్షురాలు మాసారం చెంగమ్మ, వెంకటరమణయ్య, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటి సభ్యత్వ నమోదు చరిత్రాత్మకం: టీడీపీ

పెళ్లకూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కోటి మంది సభ్యత్వ నమోదుతో టీడీపీ చరిత్ర సృష్టించిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. బుధవారం ఆయన కొత్తూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కోటి మంది సభ్యత్వ నమోదు ఘనత మంత్రి నారా లోకేశ్‌దేనని అన్నారు. గురువారం సూళ్లూరుపేట పట్టణంలో ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వాణి

వాకాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా అధికారులంతా ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని డీఎల్‌పీవో వాణి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహార తోటలు



అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూర తోటను పరిశీలిస్తున్న సీడీపీవో

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఐసీడీఎస్ పరిధిలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార తోటల పెంపకానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని సీడీపీవో షంషాద్ బేగం తెలిపారు. బుధవారం ఆమె పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందించేందుకు ఆర్గానిక్ ఎరువులతో ఆకు కూరలు, కూరగాయలను పండిస్తామన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



సునీల్‌ను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు పొద్దుటూరు సునీల్‌కు డాక్టరేట్ లభించింది. అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో సునీల్ 'ఎంతనింగ్ డి రిలయబులిటీ అండ్ కంజేసన్ కంట్రోల్ ఆఫ్ ఫ్లయింగ్ అరహక్ నెట్‌వర్క్స్ బై ఇంప్లిమెంటి మల్టీపాక్ రౌటింట్ ప్రోటోకాల్స్ టూ డిజైన్ ఎన్ ఇంమాక్యులేట్ అండ్ డెక్రస్ పోకాలజీ ఫర్ సెక్యూర్డ్ డేటా ట్రాన్‌మిషన్' అనే అంశంపైపరిశోధన చేశారు. బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణరావు ప్రశంసాపత్రం, షీల్డ్‌తో సునీల్‌ను అభినందించారు.

తగిన మోతాదులో పురుగు మందులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరి టౌన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పంటలకు తగిన మోతాదులోనే పురుగు మందులు వాడాలని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నపురెడ్డిపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆకు ముడత పురుగు ఆశించిందని, దాని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే

కోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు లో భూముల రీ సర్వేను తహసీల్దారు జయజయరావు బుధవారం ప్రారంభించారు. ఈ పంచాయతీలో ఉన్న 831.23 ఎకరా లను రీసర్వే చేయనున్నారు. ఇందుకోసం సర్వేయర్లు, వీఆర్వోలతో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలో భూముల రీ సర్వే ప్రారంభమైంది. గతంలో జరిగిన రీ సర్వేలో అవకతవకలు జరగడంతో మళ్లీ సర్వే ప్రారంభించారు. బుధవారం ఏనుగువాడలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను సర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ హరిహర, టీడీ మధుసూదనరాజుతో కలసి పరిశీలించారు.